JANA SAINYAM

# జనసైన్యం

ప్రజల పక్షం జనసైన్యం

తెలుగు దినపత్రిక



కరీంనగర్ జిల్లా. సంపుటి 3. సంచిక 301 20 శనివారం జూన్ 2026 ఎడిటర్ గుంటపల్లి స్వామి https://epaper.janasainyam.in పేజీలు: 12 రూ.5

## డీఈఓ అండతోనే ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్న ప్రైవేట్ పాఠశాలలు



ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠ రెడ్డి

జనసైన్యం సిటి

కరీంనగర్ జిల్లాలో ప్రైవేట్ కార్పొరేట్ పాఠశాలల వారు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ అడ్మిషన్లు, ప్రచారం నిర్వహిస్తున్న జిల్లా విద్యాశాఖ అధికారులు పట్టించుకోకుండా వారికి వత్తాసు పలుకుతున్నారనీ,ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలనీ, అధిక ఫీజులు పుస్తకాలు,యూనిఫామ్ లు అమ్మే పాఠశాలలను సీజ్ చేయకుండా వారి కమీషన్లకు లొంగరాని, కరీంనగర్ జిల్లాలో డీఈఓ అండదండలతోనే ప్రైవేట్ పాఠశాల వారు అక్షరాలతో విద్య వ్యాపారం చేస్తున్నారని, అధిక ఫీజులు వసూలు చేస్తున్న ప్రైవేట్ కార్పొరేట్ పాఠశాలలపై ఏసీబీ, ఐటీ విచారణ చేయాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠ రెడ్డి అన్నారు ప్రైవేట్ పాఠశాలల్లో అక్షరాలతో విద్య వ్యాపారాన్ని అరికట్టాలని, ఫీజుల నియంత్రణ చట్టం అమలు చేసి విద్యా హక్కు చట్టం అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఈరోజు ఏఐఎస్ఎఫ్ అధ్వర్యంలో కరీంనగర్ జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయం ముందు తారజు లో నోట్ల కట్టలు, పుస్తకాలు ఉంచి విన్నుతా నిరసన తెలుపడం జరిగింది.ఈ సందర్భంగా మణికంఠ రెడ్డి మాట్లాడుతూ కరీంనగర్ జిల్లాలో,నగరంలో ప్రైవేట్ పాఠశాలల వారు విద్యా వ్యాపారం చేస్తూ అక్షరాలతో లక్షల రూపాయలు దోపిడీ చేస్తున్నారని, కరీంనగర్ జిల్లాలో బీటెక్ ఫీజుల కంటే ఎల్ కే జి ఫీజులే ఎక్కువగా ఉన్నాయని, అడ్మిషన్ ఫీజు పేరుతో అయిదు వేల 20,00వేల వరకు వసూలు చేస్తున్నారని, ప్రవేట్ పాఠశాల యాజమాన్యాలు విద్యార్థుల వారి తల్లిని రక్తం తాగుతూ ఫీజులు వసూలు చేస్తున్నాయని నిబంధన విరుద్ధంగా అధిక ఫీజులు వసూలు చేస్తున్న యాజమాన్యాలపై ఐటి దాడులు నిర్వహించి ప్రజల అక్రమ సొమ్మును ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని, నిబంధనలకు విరుద్ధంగా టెక్నో, ఈ టెక్నో, ఒలంపియాడ్, వరల్డ్ అని హోర్డింగ్స్ పాఠశాలల ఆవరణలో ప్రచారం చేస్తున్న అధికారులు పట్టించుకోవడం లేదని, ఇప్పటికే అనేక పాఠశాలలో పాఠశాలల ఆవరణలోనే పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్స్ అమ్ముతున్నారని, ఫీజుల నియంత్రణ లేదని మౌలిక వసతుల కల్పనలేదని, ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్న ప్రైవేట్ పాఠశాలలకు జిల్లా విద్యాశాఖ అధికారులే వత్తాసు పలుకుతూ వారికి అండగా నిలుస్తున్నా కరీంనగర్ డీఈఓ, ఎంఇఓ ను సస్పెండ్ చేయాలని, వెంటనే కరీంనగర్ నగరంలో నిబంధన విరుద్ధంగా అనుమతులు లేకుండా నిర్వహణలో ఉన్న, ఇష్టానుసారంగా ఫీజుల దోపిడీ చేస్తున్న ప్రైవేట్ పాఠశాలలపై చర్యలు తీసుకొని అనుమతి లేని పాఠశాల పేర్లు బహిర్గతం చేయాలని లేని పక్షంలో ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో డీఈఓ ఛాంబర్ ముట్టడిస్తామని మణికంఠ రెడ్డి హెచ్చరించారు ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి మచ్చ రమేష్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు నునవత్ శ్రీనివాస్ నాయక్, జిల్లా ఆఫీస్ బేరర్ లద్దునూరి విష్ణు,,నగర నాయకులు కసిరెడ్డి సందీప్ రెడ్డి, జ్యోష్ణ, అనోష్, బోయినీ విష్ణు, నాగుల జ్ఞానేశ్వర్, నవీన్, నిఖిల్, తదితరులు పాల్గొన్నారు.

## ఇంగ్లీష్ యూనియన్ స్కూల్ తక్షణమే గుర్తింపును రద్దు చేయాలి



జనసైన్యం సిటి

ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా విచ్చలవిడిగా డైరీస్ బెల్టు ,టైలు ,అమ్ముతూ విద్యార్థులను తల్లిదండ్రులను రక్తాన్ని జలగల్లాగా తాగుతున్న యాజమాన్యం ఇంగ్లీష్ యూనియన్ స్కూల్ ను తక్షణమే గుర్తింపును రద్దు చేయాలి. ఈ సందర్భంగా పిడిఎస్యు రాష్ట్ర కోశాధికారి అంగిడి కుమార్ మాట్లాడుతూ,...అక్షరాల కోసం లక్షల రూపాయల వ్యాపారాన్ని చేస్తున్నాం విద్యాసంస్థల పైన చర్యలు తీసుకొని గుర్తింపును రద్దు చేయాలని పేద విద్యార్థులకు న్యాయం చేయాలని డీఈఓ ఆఫీస్ ముందు ధర్నా నిర్వహించడం జరిగింది. పాఠశాలలకు గ్రౌండ్, ఫైర్ సేఫ్టీ, గవర్నమెంట్ బాడీ, అర్హత గల ఫ్యాకల్టీ లేదు, విద్యార్థులకు సరిపోయే టాయిలెట్స్ లేదు 25% ఉచిత విద్యను కూడా అందించడం లేదు , ప్రభుత్వ నిబంధనలు తుంగలోకి తొక్కి విద్యా వ్యాపారం చేస్తున్నటువంటి పాఠశాలపై తక్షణమే చర్యలు తీసుకోవాలి లేనియెడల ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తాము ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి లోకిని మల్లేష్, జిల్లా ఉపాధ్యక్షులు వెల్ది రాజు పాల్గొన్నారు.

## భూధార్ సర్వే, భూభారతి దరఖాస్తుల పరిష్కారాన్ని వేగవంతం చేయాలి



జనసైన్యం సిటి

భూధార్ సర్వే, భూభారతి దరఖాస్తుల పరిష్కారాన్ని వేగవంతం చేయాలని,సాదా బైనామా, రీ-సర్వే ప్రక్రియలను గడువులోగా పూర్తి చేయాలని,రెవెన్యూ సేవలను ప్రజలకు పారదర్శకంగా అందించాలని రాష్ట్ర రెవెన్యూ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ డి.ఎస్. లోకేష్ కుమార్, ఐఏఎస్ అధికారులను ఆదేశించారు.

హైదరాబాద్ నుండి రాష్ట్ర రెవెన్యూ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ డి.ఎస్. లోకేష్ కుమార్, ఐఏఎస్ పలు జిల్లాల కలెక్టర్లతో భూధార్ సర్వే, భూభారతి, సాదా బైనామా, నాన్-కడాస్ట్రల్ గ్రామాల రీ-సర్వే, నక్షా కార్యక్రమం తదితర అంశాలపై శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్ సమావేశం నిర్వహించారు.

ఈ వీడియో కాన్ఫరెన్స్ సమావేశానికి కలెక్టర్ చిత్రా మిశ్రా క్యాంపు కార్యాలయం నుంచి అదనపు కలెక్టర్ రెవెన్యూ శ్రీనివాస్ రెడ్డి తో కలిసి హాజరయ్యారు.

ఈ సందర్భంగా ప్రిన్సిపల్ సెక్రటరీ డి.ఎస్. లోకేష్ కుమార్, ఐఏఎస్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా కొనసాగుతున్న భూధార్ సర్వే కార్యక్రమాన్ని వేగవంతంగా పూర్తి చేయాలని, ప్రతి భూ యజమానికి ఖచ్చితమైన భూ వివరాలు నమోదు అయ్యేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

అలాగే భూభారతి కార్యక్రమం కింద వచ్చిన దరఖాస్తులను ఎటువంటి జాప్యం లేకుండా పరిశీలించి త్వరితగతిన పరిష్కరించాలని, ప్రజలకు రెవెన్యూ సేవలు సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

సాదాబైనామా దరఖాస్తుల పరిశీలనను వేగవంతం చేసి అర్హులైన దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలని, భూములకు సంబంధించిన పెండింగ్ అంశాలను ప్రాధాన్యతగా తీసుకుని పూర్తి చేయాలని పేర్కొన్నారు. జిల్లాల్లో కొనసాగుతున్న నాన్-కడాస్ట్రల్ గ్రామాల రీ-సర్వే కార్యక్రమాన్ని నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని, ఎంపిక చేసిన గ్రామాల్లో నక్షా డిజిటల్ భూ మ్యాపింగ్ పనులను నాణ్యత ప్రమాణాలతో అమలు చేయాలని ఆదేశించారు. భూముల హద్దుల నిర్ధారణలో పారదర్శకత పాటిస్తూ భూ రికార్డుల ఆధునీకరణకు అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించి, రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను గడువులోగా పూర్తి చేయడానికి సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత రెవెన్యూ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



స్వప్న శ్రీధర్ దంపతులకు పెళ్లి రోజు శుభాకాంక్షలు



మనోజ్ అనుష దంపతులకు పెళ్లిరోజు శుభాకాంక్షలు



మధుసూదన్ రెడ్డి మంజుల దంపతులకు పెళ్లిరోజు శుభాకాంక్షలు

# ఘనంగా రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు




జనసైన్యం సిటి

కాంగ్రెస్ పార్టీ అగ్రనేత, లోక్‌సభ లో కాంగ్రెస్ పక్ష నాయకుడు రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలను శుక్రవారం గాంధీ భవన్‌లో టీపీసీసీ ఎస్సీ సెల్ చైర్మన్, మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తల సమక్షంలో ఎమ్మెల్యే కేక్ కట్ చేసి రాహుల్ గాంధీకి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.అనంతరం డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ రాహుల్ గాంధీని ప్రధాన మంత్రిని చేయడమే మనందరి లక్ష్యం కావాలన్నారు. ఈ దిశగా పార్టీ శ్రేణులంతా క్షేత్రస్థాయిలో గట్టి కృషి చేయాలన్నారు. దేశ రాజకీయాల్లో విలువలతో కూడిన నాయకత్వానికి రాహుల్ గాంధీ ప్రతీకగా నిలిచారని ఆయన పేర్కొన్నారు. ప్రజాస్వామ్య పరిరక్షణ, రాజ్యాంగ విలువల కాపాడటం, సామాజిక న్యాయం సాధన కోసం ఆయన నిరంతరం పోరాటం చేస్తున్నారని కొనియాడారు. ప్రస్తుత రాజకీయ పరిస్థితుల్లో దేశానికి దూరదృష్టి కలిగిన, ప్రజల సంక్షేమం పట్ల అంకితభావంతో పనిచేసే నాయకత్వం అవసరమని, ఆ లక్షణాలన్నీ రాహుల్ గాంధీలో మెండుగా ఉన్నాయని ఎమ్మెల్యే పేర్కొన్నారు. దేశంలోని యువత, రైతులు, కార్మికులు, మహిళలు, వెనుకబడిన వర్గాల సమస్యలను పార్లమెంట్‌తో పాటు ప్రజల మధ్యకు తీసుకెళ్లిన నాయకుడు రాహుల్ గాంధీయేనని అన్నారు. భారత్ జోడో యాత్ర, భారత్ జోడో న్యాయ యాత్రల ద్వారా దేశ ప్రజల్లో ఐక్యత, సోదరభావం, సామాజిక సమానత్వం సందేశాన్ని బలంగా చాటారని తెలిపారు.కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలను గ్రామీణ స్థాయి వరకు తీసుకెళ్లి ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. రాహుల్ గాంధీ ఆశయాల సాధన కోసం ప్రతి కార్యకర్త అంకితభావంతో పనిచేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో టీపీసీసీ ఎస్సీ సెల్ అధికార ప్రతినిధి, రాష్ట్ర కోఆర్డినేటర్ ఆరెపల్లి రాజేందర్, ఎస్సీ సెల్ రాష్ట్ర నాయకులు గడ్డం శ్రీనివాస్, జగన్, వినోద్ సింగ్,నర్సింహ,ఓం ప్రకాశ్, చంద్రయ్య, చంద్రశేఖర్ తోపాటు పలు జిల్లా అధ్యక్షులు, బాధ్యులు తదితరులు పాల్గొన్నారు.

# బీసీ హాస్టల్ ను ఎత్తివేయద్దు

**జనసైన్యం సిటి**

ముకరాంపురంలోని పాఠశాల స్థాయి బీసీ విద్యార్థుల వసతి గృహాన్ని ఎత్తివేసేందుకు అధికారులు కుట్ర పన్నుతున్నారని బీసీ సంఘాల జేఏసీ ఆరోపించారు . ఈరోజు ఆ వసతి గృహాన్ని జేఏసీ నాయకులు కేశిపెద్ది శ్రీధర్ రాజు , దొగ్గలి శ్రీధర్ , మాదాసు సంజీవ్ , మియాపురం రవీంద్ర చారి లు సందర్శించారు ఈ సందర్భంగా వీరు మాట్లాడుతూ ఈనెల 15 పాఠశాలలు వసతి గృహాలు ప్రారంభం కాగా ఈ యొక్క పాఠశాల స్థాయి బీసీ వసతి గృహాన్ని అధికారులు ఇప్పటికీ తెరవలేదు బిసి జేఏసీ పక్షాన అధికారులను నిలదీయగా ఇక్కడ విద్యార్థులు రావడంలేదని అందుకే మూసివేసామని చెప్పారు దీనిలో 30 మంది పైగా విద్యార్థులు వసతి గృహంలో ఉండగా వీరిని వసతి గృహానికి రావద్దని అలాగే నూతన అడ్మిషన్లను తీసుకోవడం లేదు నగరంలో బీసీ విద్యార్థుల కోసం పాఠశాల స్థాయిలో ఒక్క వసతి గృహం కూడా మరొకటి లేదు. ప్రస్తుతం ఉన్న ఈ వసతిగృహంలో మంథని లాంటి సుదూర ప్రాంతాల నుండి విద్యార్థులు ఉంటున్నారు అధికారులు నూతన విద్యార్థులకు అడ్మిషన్లు ఇవ్వడం లేదు ఉన్న విద్యార్థులను వేరే వసతి గృహానికి తరలించే ప్రయత్నం చేస్తున్నారు మొత్తానికి ఈ యొక్క వసతి గృహాన్ని ఎత్తివేసే కుట్ర చేస్తున్నారు పాఠశాల స్థాయి విద్యార్థుల కొరకు ఉన్న ఈ బీసీ వసతి గృహాన్ని తరలించొద్దని ఉన్నత అధికారులను బీసీ జేఏసీ కోరుతుంది వెంటనే ఈ యొక్క వసతి గృహాన్ని



ప్రారంభించి పాత విద్యార్థులను రప్పించి నూతన విద్యార్థులకు అడ్మిషన్లు ఇవ్వాలని అధికారులను డిమాండ్ చేస్తున్నాం లేని పక్షాన ఆందోళన కార్యక్రమాలు చేపడతాం . నగరంలో రెండు కళాశాల స్థాయి బీసీ బాలికల వసతి గృహాలకు , కళాశాల స్థాయి బీసీ బాలుర వసతి గృహానికి పూర్తిస్థాయిసంరక్షణాధికారులు లేరు ఇతరసంరక్షణ అధికారులఅదనపు బాధ్యతలు అప్పగించారు ఈ మూడు వసతి గృహాలలో దాదాపు ఒక్కో వసతి గృహంలో 200 మంది విద్యార్థులు వసతి పొందుతున్నారు ఇలా ఇన్చార్జిల వల్ల విద్యార్థు లు ఇబ్బందులకు గురై ప్రమాదం ఉంది వెంటనే పూర్తిస్థాయి సంరక్షణ అధికారులునియమించాలని ఉన్నతాధికారులను బిసి జేఏసీ కోరుతుందని తెలిపారు.

# నిబంధనలకు విరుద్ధంగా అక్రమంగా పాఠ్యపుస్తకాలమ్ముతున్న బుక్ స్టాల్స్ పై చర్య తీసుకోవాలి



జనసైన్యం సిటి

విద్యార్థుల తల్లిదండ్రులను దోపిడీ చేస్తూ ధరలు, ప్రచురణకర్తల వివరాలు ముద్రించని స్కూల్ పుస్తకాలను అమ్ముతున్న బుక్ స్టాల్స్‌పై తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరుతూ ఎస్ఎఫ్ఐ కరీంనగర్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కమర్షియల్ ట్యాక్స్ శాఖ జాయింట్ కమిషనర్ గోపాల్ గారికి వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు ఆసంపెల్లి వినయ్ సాగర్ మాట్లాడుతూ, జిల్లాలోని అనేక ప్రైవేట్ పాఠశాలలు యాజమాన్యం నిర్దిష్ట బుక్ స్టాల్స్‌తో కుమ్మక్కై విద్యార్థులను అక్కడే పుస్తకాలు కొనుగోలు చేయాలని ఒత్తిడి చేస్తున్నాయని ఆరోపించారు. మార్కెట్‌లో అమ్ముతున్న అనేక స్కూల్ పుస్తకాలపై గరిష్ట చిల్లర ధర (ఎమ్మార్పీ), ప్రచురణకర్త పేరు, చిరునామా, ముద్రణ వివరాలు లేకపోవడం గమనార్హమన్నారు. ధరలు మరియు ప్రచురణకర్తల వివరాలు లేకుండా పుస్తకాలను అమ్ముతున్న వినియోగదారుల హక్కులకు విరుద్ధమని, సంబంధిత చట్టాల ప్రకారం ఇది శిక్షార్హమైన నేరమని పేర్కొన్నారు. పుస్తకాల అసలు ధర ఎంతో తెలియని పరిస్థితిలో తల్లిదండ్రుల నుంచి అధిక మొత్తాలు వసూలు చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రతి సంవత్సరం విద్యా సంవత్సరం ప్రారంభంలో ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలు పుస్తకాలు, నోట్‌బుక్స్, యూనిఫాంల పేరుతో వేలాది రూపాయలు వసూలు చేస్తూ తల్లిదండ్రులపై తీవ్రమైన ఆర్థిక భారం మోపుతున్నాయని విమర్శించారు. విద్యను వ్యాపారంగా మార్చే ఈ ధోరణిని ప్రభుత్వం అరికట్టాలని డిమాండ్ చేశారు.అలాగే జిల్లాలోని అన్ని బుక్ స్టాల్స్‌పై ప్రత్యేక తనిఖీలు నిర్వహించి, ధరలు మరియు ప్రచురణకర్తల వివరాలు లేని పుస్తకాల విక్రయాలను నిలిపివేయాలని, అక్రమాలకు పాల్పడుతున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. విద్యార్థులు, తల్లిదండ్రుల ప్రయోజనాలను కాపాడేందుకు ప్రభుత్వం కఠిన చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి ఆకాష్, బోగేష్ నాయకులు సందేశ్, సనిత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# కరీంనగర్ జిల్లాలో ఎలుగుబంటి..!



**జనసైన్యం సిటి**
కరీంనగర్ జిల్లా గంగాధర మండలం గట్టు బూత్కూర్ గ్రామంలో అర్ధరాత్రి ఎలుగుబంటి సంచరించింది. గ్రామ వీధుల్లోకి వచ్చిన ఎలుగుబంటిని చూసిన స్థానికులు తమ ఫోన్లలో వీడియోలు తీశారు. కుక్కలు గుంపుగా చేరి ఎలుగుబంటిని వెంబడించి, గ్రామం వెలుపలికి తరిమికొట్టాయి. ఎలుగుబంటి వచ్చి వెళ్లడంతో గ్రామస్థులు భయాందోళనకు గురవుతున్నారు.

# ఘనంగా రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు

**జనసైన్యం సిటి**



కరీంనగర్ జిల్లా కేంద్రంలోని బాబు జగ్జీవన్‌రామ్ చౌరస్తా వద్ద లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలను మాజీ కార్పొరేటర్ అర్ష మల్లేశం ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు కేక్ కట్ చేసి మిఠాయిలు పంచిపెట్టారు. మాజీ కార్పొరేటర్ అర్ష మల్లేశం మాట్లాడుతూ, గాంధీ కుటుంబం త్యాగాలకు మారుపేరని అన్నారు. దేశం కోసం ఇందిరా గాంధీ, రాజీవ్ గాంధీ చేసిన త్యాగాలను స్మరించుకున్నారు. ఆ వారసత్వాన్ని కొనసాగిస్తూ భారత రాజకీయాల్లో కాంగ్రెస్ పార్టీని ముందుకు తీసుకెళ్తున్న యువ నాయకుడు రాహుల్ గాంధీ అని కొనియాడారు. యువత, రైతులు, మహిళలు, నిరుద్యోగుల సమస్యల పరిష్కారం కోసం రాహుల్ గాంధీ నిరంతరం పోరాడుతున్నారని పేర్కొన్నారు. భారత్ జోడో యాత్ర, భారత్ జోడో న్యాయ యాత్రల ద్వారా దేశ ఐక్యత, రాజ్యాంగ విలువల పరిరక్షణ కోసం ఆయన కృషి చేస్తున్నారని తెలిపారు.రానున్న రోజుల్లో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేసి, దేశ ప్రధానిగా రాహుల్ గాంధీ సేవలందించడం ఖాయమని అర్ష మల్లేశం విశ్వాసం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ కాశెట్టి శ్రీనివాస్, మీసాల శంకర్, మూల కృష్ణారెడ్డి, అనంతుల రమేశ్, దుగ్గ మహేందర్, అహ్మద్ హుస్సేన్, గండి గణేష్, వజీర్ ఫారుఖ్, మహమ్మద్ సమీ, అహ్మద్, మీసాల గంగారాం తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇళ్ల పనులు వేగవంతం చేయాలి

## కలెక్టర్ చిత్రా మిశ్రా



**జనసైన్యం సిటి**
లబ్ధిదారులకు అవగాహన కల్పిస్తూ ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులు వేగవంతం చేయాలని కలెక్టర్ చిత్రా మిశ్రా .. గృహ నిర్మాణ శాఖ అధికారులను ఆదేశించారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో 25వ డివిజన్ పరిధి సుభాష్ నగర్ ఏరియా బుట్టి రాజారాం కాలనీలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను కలెక్టర్.. డిఆర్ఓ స్వామి, గృహ నిర్మాణ శాఖ అధికారులతో కలిసి పరిశీలించారు. ఇల్లు మంజూరై పనులు ప్రారంభించని లబ్ధిదారులకు అవగాహన కల్పించి ఇళ్ల నిర్మాణం ప్రారంభించేలా చూడాలన్నారు. జిల్లాలో బిల్లులు జమ కాని లబ్ధిదారుల వివరాలతో నివేదిక అందించాలని అధికారులను ఆదేశించారు. ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ ఇళ్ల నిర్మాణం పరిశీలించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ స్వామి, గృహ నిర్మాణ శాఖ అధికారులు డీఈ వెంకటరమణ, ఏఈలు ఊర్మిళ, వర్షిని తదితరులు పాల్గొన్నారు.

# శరణార్థుల హక్కుల పట్ల సంఘీభావం తెలుపలేమా !

**డాక్టర్ బుర్ర మధుసూదన్ రెడ్డి**

## (20 జూన్ "ప్రపంచ శరణార్థి దినోత్సవం" సందర్భంగా)



యుద్ధాలు, సంక్షోభాలు, హింసలు, పీడించడం, వాతావరణ ప్రతికూల మార్పులు, జాతి వివక్షలు, మత విద్వేషాలు, జాతీయత, కొన్ని సామాజిక లేదా రాజకీయ సంఘాల్లో సభ్యత్వాల కారణంగా ప్రాణ భయంతో మరో దేశానికి వెళ్లి శరణు కోరి ప్రాణాలు కాపాడుకునే ప్రత్యేక వ్యక్తులు లేదా సమూహాలను శరణార్థులుగా నిర్వచిస్తాం. నేరుగా మరో దేశంలో శరణార్థులుగా చేరే వారు, ఆశ్రమం పొందే వారు, అంతర్గతంగా స్థానభ్రంశం పొందిన వారు, ఏ దేశానికి చెందని వారు, అనేక ఏళ్ల తర్వాత తిరిగి తమ దేశానికి చేరి వారందరూ శరణార్థుల జాబితాలో వస్తారు.

**ప్రపంచ శరణార్థి దినోత్సవం-2026 ఇతివృత్తం :**

శరణార్థులు, వారి పిల్లలు పడుతున్న అమానవీయ వేదనలను గుర్తించి ఐరాస తీసుకున్న నిర్ణయం ప్రకారం ప్రతి ఏట 20 జూన్ రోజున "ప్రపంచ శరణార్థి దినోత్సవం (వరల్డ్ రెఫ్యూజీ డే)"ను 2001 నుంచి పాటించడం జరుగుతోంది. మరో దేశం నుంచి ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని వచ్చిన శరణార్థులు కూడా సాధారణ మానవులే అని, వారికి కూడా కనీస మానవ హక్కులు వర్తిస్తాయని, వారితో ధైర్యాన్ని నింపడం, వారి పిల్లలకు విద్య వసతులు విస్తరించాలని, ఆకలి చావుల కోరల్లో చిక్కకుండా చూసుకోవాలని ప్రపంచ దేశాలకు అవగాహన పరచడానికి ఈ వేదికలు ఉపయోగపడుతున్నాయి. 2026 ప్రపంచ శరణార్థి దినోత్సవం ఇతివృత్తంగా "అందరు సురక్షితంగా ఉండే వరకు శరణార్థులకు సంఘీభావం ప్రకటిద్దాం" అనే అంశాన్ని నిర్ణయించారు. 2026 శరణార్థి వారం ఇతివృత్తంగా "సూపర్ పవర్‌గా పౌర సమాజం" అనే అంశాన్ని తీసుకున్నారు. శరణార్థులను కూడా సాధారణ పౌరులుగా చూడాలని, శత్రువులుగా భావించ వద్దని ఐరాస సూచిస్తున్నది. శరణార్థుల పట్ల సహానుభూతి చూపడం, కనీస మానవ హక్కులను కల్పించడం, వారికి సంఘీభావంగా ప్రచారాలు నిర్వహించడం, వారి జీవిత కథలను వినడం, వారి అనుభవాలను అర్థం చేసుకోవడం, వారి పట్ల రాజకీయ ఏకీకరణ జరగడం, వారి అభ్యున్నతికి నిధులు కేటాయించడం, వారి మనోభావాలను అర్థం చేసుకోవడం లాంటివి నిత్యం కొనసాగాలి.

**భారత్‌లో శరణార్థుల సమస్యలు:**

భారత్‌లోకి శ్రీలంక, మియాన్మార్, అఫ్ఘానిస్థాన్, చిబెట్, బంగ్లాదేశ్ లాంటి ఇరుగు పొరుగు దేశాల నుంచి వేల మంది శరణార్థులు భారత భూభాగంలోకి శరణార్థులుగా చేరడం కొనసాగుతున్నది. శ్రీలంకన్ తమిళులు, రెహింగ్యాలు, టిబెటన్లు, చక్మా-హాజోంగ్‌లు, జూయిష్ వర్గాలు అధిక సంఖ్యలో భారత్‌కు రావడం, శరణార్థులుగా జీవితాలను కొనసాగించుకోవడం జరుగుతూ కొన్ని సార్లు మన దేశంలో శాంతి భద్రతల సమస్యలకు కూడా కారణం అవుతున్నారని కూడా భావించడంతో జరుగుతోంది. 2022 వివరాల ప్రకారం, భారత్‌లో 46,000 మంది, అందులో 22,509 మంది రొహింగ్యాలు కూడా శరణార్థులు నమోదు అయినట్లు గణాంకాలు తెలుపుతున్నాయి. భారత్‌లో చేరిన శరణార్థులు అధిక శాతం పట్టణ ప్రాంతాల్లో స్థిరపడి అసంఘటిత పనుల్లో నిమగ్నం అవుతున్నారు. శరణార్థి కుటుంబాలకు చెందిన పిల్లలు 7 శాతం మాత్రమే విద్య కొనసాగిస్తున్నారని, 87 శాతం శరణార్థులు అల్పాదాయ, మధ్యాదాయ దేశాల్లోనే జీవిస్తున్నారని తెలుసుకోవాలి.

ప్రపంచ శరణార్థి దినోత్సవ వేదికగా నిజమైన శరణార్థులను గుర్తించి వారికి కనీస వసతులను కల్పించడం, దురుద్దేశంతో భారత్‌లోకి చేరిన శరణార్థులను ఏరిపారేయడం నిరంతరం జరగాలి. నిస్సహాయ స్థితుల్లో శరణార్థులుగా చేరిన వారి కుటుంబాలకు కనీస అవసరాలు తీర్చడం, సహానుభూతితో వారికి గొడుగు పట్టడం, వారి పిల్లలకు చదువుకునే అవకాశాలు కల్పించడం, మానవీయ కోణంలో అక్కున చేర్చుకోవడం, వారికి వైద్య ఆరోగ్య వసతులు కల్పించం, వారిని మానవులుగా గౌరవించడం, సమానత్వ భావనలను ఆచరించడం, కనీస సహకారాలను అందించడం కొనసాగాలి. ఊహించని సందర్భాల్లో పరాయి దేశంలోకి చేరిన శరణార్థులకు మానవ హక్కుల గొడుగు పడదాం, వారి శ్రేయస్సుకు పాటు పడదాం.

# ఘనంగా రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు




**జనసైన్యం సిటి**
జూన్ 19న ఇందిరా చౌక్ వద్ద లోక్‌సభ ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ పార్టీ అగ్రనేత శ్రీ రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలను కరీంనగర్ కార్పొరేషన్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు, కార్పొరేటర్ వైద్యుల అంజన్ కుమార్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన చొప్పదండి ఎమ్మెల్యే, డిసిసి అధ్యక్షులు డా.మేడిపల్లి సత్యం కేక్ కట్ చేసి జన్మదిన వేడుకలను ప్రారంభించారు.ఈ సందర్భంగా కార్పొరేషన్ కాంగ్రెస్ అధ్యక్షులు వైద్యుల అంజన్ కుమార్ మాట్లాడుతూ, దేశ సమగ్రత కోసం, ప్రజల సాదకబాధకాలు తెలుసుకునేందుకు కన్యాకుమారి నుండి కాశ్మీర్ వరకు భారత్ జోడో యాత్ర చేసి, భారతదేశ ప్రజల కష్టసుఖాలను తెలుసుకున్నారని అన్నారు. బి.సి.లకు కులగణన చేయాలని, 'జిత్నీ ఆబాదీ ఉత్నా హక్' అనే నినాదంతో దేశవ్యాప్తంగా పోరాడుతూ, తన ప్రాణాలను సైతం లెక్కచేయకుండా దేశ ప్రజల కోసం పనిచేస్తున్నారని తెలిపారు. ఉన్నత చదువులు చదువుకున్న మహానాయకుడు మన రాహుల్ గాంధీ అని, రాబోయే రోజుల్లో దేశ ప్రజలు ఆయనను గౌరవప్రదమైన ప్రధానమంత్రిగా చూడాలని ఎదురుచూస్తున్నారని పేర్కొన్నారు.ఈ వేడుకల్లో మున్నూరు కాపు కార్పొరేషన్ చైర్మన్ బొమ్మ శ్రీరామ్ చక్రవర్తి, =ూ నెంబర్ పడాల రాహుల్ జిల్లా కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ పద్మాకర్ రెడ్డి, అర్బన్ బ్యాంక్ అధ్యక్షులు కర్ర రాజశేఖర్ రజిత రెడ్డి మహాలక్ష్మి జ్యోతి రెడ్డి స్వప్న మాదా శీను దుండిగళ్ళ మధు పులి ఆంజనేయులు, తదితర ముఖ్య నేతలు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

# తోడు నీడ



నన్ను క్షణం కూడా విడవక..
సదా నా వెంట నడిచి..
ఎన్నడూ ఎదురు తిరగని..
ఎప్పుడూ ప్రశ్నలు అడగని..
అలసట అసలే ఎరుగని..
అవిభాజ్య ఆత్మీయ నేస్తం నీడ !
నా కష్టసుఖాల్లో తోడై ఉంటూ..
మాటలే రాని సైగల ఆకృతి..
చీకట్లో నాతో పాటు విశ్రమిస్తూ..
వెలుగులోకి రాగానే ప్రత్యక్షమై..
మలి సంధ్యలో నన్ను వీడి..
నా ప్రాణ మిత్రుడైంది నీడ !
బేషరతు అనుబంధాలతో..
నాతో కలిసి శరీర కదలికలు
కుడి ఎడమల ప్రదక్షణలు చేస్తూ..
పొడుగు పొట్టి వేశాలు వేస్తూ..
సూర్యుడి ఆదేశాలు మన్నిస్తూ..
చీకట్లో తుర్రుమని జారుకునే నీడ !
నీడ తనదైన ఓ నిర్దిష్ట ఆకారంతో..
తన ఆకృతిని మార్చుకుంటూ..
నేను నిలిస్తే తాను నిలుస్తూ..
నేను కూర్చుంటే తాను కూర్చుంటూ..
కాలరెగిరేస్తే తాను కూడా కాపీ కొడుతూ..
నన్ను గురువుగా పూజిస్తోంది..
నాకు తోడు నీడగా నిలిస్తోంది 'ఛాయ' !

మధుపాలీ

## ఎస్సీ స్టడీ సర్కిల్ ను అధునాతనంగా తీర్చిదిద్దాలి

### కలెక్టర్ చిత్రా మిశ్రా

జనసైన్యం సిటి



ఎస్సీ స్టడీ సర్కిల్ లో అన్ని సౌకర్యాలు కల్పించి అధునాతనంగా తీర్చిదిద్దాలని కలెక్టర్ ఆదేశించారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఎస్సీ స్టడీ సర్కిల్ ను సందర్శించారు. గదులు కలియ తిరుగుతూ పరిసరాలు పరిశీలించారు. ప్రస్తుత వసతుల గురించి గురించి సోషల్ వెల్ఫేర్ ఇంచార్జి డిప్యూటీ డైరెక్టర్ తిరుపతిరావును తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా అన్ని సౌకర్యాలు కల్పించాలన్నారు. పరిసరాలను శుభ్రంగా ఉంచాలన్నారు. ప్రశాంత వాతావరణంలో వారు చదువుకునేలా రీడింగ్ రూమ్ సిద్ధం చేయాలన్నారు. తాగునీరు మరుగుదొడ్లు, విద్యుత్ సౌకర్యం వంటి అంశాల్లో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. స్టోర్ రూమ్ లో ఉన్న వస్తువులను ఖాళీ చేయించాలని.. వారంలోగా భవనానికి అవసరమైన మరమ్మత్తులు చేయించాలని టీజీ డబ్ల్యూ ఐడీఎస్ అధికారులను ఆదేశించారు. ఆన్ లైన్ పరీక్ష నిర్వహించేలా కంప్యూటర్ ల్యాబ్ ఏర్పాటు చేయాలన్నారు.ఈ కార్యక్రమంలో స్టడీ సర్కిల్ ఉద్యోగులు ఉన్నారు.

## కొడిమ్యాలలో ఘనంగా రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు

కొడిమ్యాల జన సైన్యం న్యూస్.

ఆల్ ఇండియా కాంగ్రెస్ కమిటీ (ఏఐసీసీ) అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలను కొడిమ్యాల మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు.మండల కాంగ్రెస్ పార్టీ కార్యాలయం ఎదుట స్థానిక అంగడి బజార్ చౌరస్తాలో కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు.మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గోగూరి నాగభూషణ్ రెడ్డి,ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాగభూషణ్ రెడ్డి మాట్లాడుతూ ప్రియతమ నాయకుడు రాహుల్ గాంధీకి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తూ, దేశంలో ప్రజాస్వామ్య విలువల పరిరక్షణ, రాజ్యాంగ స్ఫూర్తి కాపాడటం, సామాజిక న్యాయం సాధన కోసం ఆయన నిరంతరం పోరాటం చేస్తున్నారని పేర్కొన్నారు.యువత, రైతులు, కార్మికులు, మహిళలు, వెనుకబడిన వర్గాల సమస్యలను దేశవ్యాప్తంగా ప్రజల మధ్యకు తీసుకెళ్లి వారి గొంతుకగా నిలుస్తున్న నాయకుడు రాహుల్ గాంధీ అని కొనియాడారు.ఈ సందర్భంగా కార్యకర్తలు "జై కాంగ్రెస్.. జై జై కాంగ్రెస్", "భావి భారత ప్రధాని రాహుల్ గాంధీ" అంటూ నినాదాలు చేశారు.కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ గడ్డం జీవన్ రెడ్డి, సర్పంచుల ఫోరం అధ్యక్షుడు కదారి మల్లేశం,మండల కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు చిలువేరి నారాయణ తిప్పాయిపల్లి మాజీ సర్పంచ్ మేకల మల్లేశం, సర్పంచ్ నేరెళ్ల మహేష్, అజయ్ రెడ్డి, కోనాపురం సర్పంచ్ మల్లేశం, మాజీ ఎంపీపీ.పర్లపెల్లి ప్రసాద్, మండల నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# డిజిటల్ అంతరాన్ని అధిగమిద్దాం

## (జూన్ 20న "ప్రపంచ వై-ఫై దినోత్సవం" సందర్భంగా)

డాక్టర్ మధుసూదన్ రెడ్డి బుర్ర




ప్రతి సంవత్సరం జూన్ 20న జరుపుకునే "ప్రపంచ వై-ఫై దినోత్సవం(వరల్డ్ వై-ఫై డే), "కనెక్టెడ్ కమ్యూనిటీస్ ఫోరమ్" నాయకత్వంలో "వైర్‌లెస్ బ్రాడ్‌బ్యాండ్ అలయన్స్" నిర్వహించే ఒక ప్రత్యేకమైన ప్రపంచవ్యాప్త కార్యక్రమం. "వై-ఫై" అనేది "వైర్‌లెస్ ఫిడిలిటీ"కి సంక్షిప్త రూపంగా విస్తృతంగా బోధించబడుతూ ఆమోదించబడింది. ఈ రోజున మన దైనందిన జీవితాలకు వై-ఫై అందించే గొప్ప సహకారాన్ని, ఆవిష్కరణను, ఇంటర్నెట్ సదుపాయం లేని వారిని అనుసంధానించాలనే లక్ష్యాన్ని మనం తీసుకుంటున్నాం. నేటికీ ప్రపంచవ్యాప్తంగా 4 బిలియన్లకు పైగా ప్రజలకు ఇంటర్నెట్ సదుపాయం లేదు. ఇంటర్నెట్ సదుపాయం అభివృద్ధి చెందిన, అభివృద్ధి చెందుతున్న దేశాల ప్రజలకు వృద్ధిని అందిస్తుంది, వారి సామాజిక చలనశీలతను, కంప్యూటర్ అక్షరాస్యతను మెరుగుపరుస్తుంది, అలాగే వారి విద్యా అవకాశాలను సుసంపన్నం చేస్తుంది. ఈ దినోత్సవం 1997లో ప్రారంభమై ప్రతి ఏటా మరింత ఉత్సాహంతో కొనసాగుతున్నది.

### అనుసంధానం లేని వారిని అనుసంధానిద్దాం:

ప్రపంచ వై-ఫై దినోత్సవం, డిజిటల్ అంతరాన్ని తగ్గించడంలో వైర్‌లెస్ టెక్నాలజీ పోషించిన పరివర్తనాత్మక పాత్రను వేడుకగా జరుపుకుంటుంది. అలాగే, గ్రామీణ, పట్టణ ప్రాంతాలలో "అనుసంధానం లేని వారిని అనుసంధానించే" నిరంతర కార్యాన్ని ఇది ప్రముఖంగా చాటి చెబుతుంది. ఇంటర్నెట్ సదుపాయాన్ని అందుబాటు ధరలో, సుస్థిరంగా అందించే ప్రయత్నాలను ఇది హైలైట్ చేస్తుంది. తద్వారా, అణగారిన వర్గాలకు విద్య, పరిశోధన, టెలి-హెల్త్, ఆర్థిక అవకాశాలను కల్పిస్తుంది. 1977 నాటి తొలి 2 మీఎజూం నెట్‌వర్క్‌ల నుండి నేటి ఆధునిక గిగాబిట్-స్పీడ్ వై-ఫై 6, వై-ఫై 7 టెక్నాలజీల వరకు వేగవంతమైన పురోగతిని ఈ రోజు గుర్తిస్తుంది. ఇటీవల ప్రారంభించిన ఇండియా మొబైల్ కాంగ్రెస్ యొక్క "పరివర్తన కోసం ఆవిష్కరణలు" (Innovate to Transform) అనే థీమ్‌కు అనుగుణంగా, ఈ సంవత్సరం ప్రపంచ వై-ఫై దినోత్సవ వేడుకలను "భారతదేశాన్ని పరివర్తన చెందిస్తూ, ప్రపంచం కోసం ఆవిష్కరిస్తూ" (Transforming India, Innovating for the World) అనే థీమ్‌తో జరుపుకుంటున్నారు.

### ప్రధానమంత్రి వై-ఫై యాక్సెస్ నెట్‌వర్క్ ఇంటర్‌ఫేస్, PM-WANI:

ప్రపంచ కనెక్టివిటీపై వై-ఫై యొక్క ప్రగాఢ ప్రభావాన్ని, అలాగే ఆర్థిక వృద్ధి, సామాజిక చైతన్యం, విద్య, డిజిటల్ సమ్మిళితాన్ని నడిపించడంలో దాని కీలక పాత్రను ఈ రోజు నొక్కి చెబుతోంది. భారతదేశంలో, PM-WANI (ప్రధాన మంత్రి వై-ఫై యాక్సెస్ నెట్‌వర్క్ ఇంటర్‌ఫేస్) వంటి కార్యక్రమాలు, అందరికీ డిజిటల్ సమ్మిళితం అనే లక్ష్యానికి మద్దతునిస్తూ, పబ్లిక్ హాట్‌స్పాట్‌లను విస్తరించాలని లక్ష్యంగా పెట్టుకున్నాయి. భారతదేశంలో 90 శాతానికి పైగా బ్రాడ్‌బ్యాండ్ వినియోగం వై-ఫై నెట్‌వర్క్‌ల ద్వారానే జరుగుతున్నందున, ఇటీవల 6 GHz బ్యాండ్‌ను డీలైసెన్సింగ్ చేయడం అనేది తదుపరి తరం వై-ఫై (6జు మరియు ఆపైన) యొక్క కొత్త శకాన్ని ఆవిష్కరిస్తుందని భావిస్తున్నారు. ఇది వేగవంతమైన, మరింత విశ్వసనీయమైన హోమ్ వై-ఫైకి, భవనాలలో మెరుగైన డిజిటల్ కనెక్టివిటీ కవరేజీకి, స్మార్ట్ సిటీలు, స్మార్ట్ ఫ్యాక్టరీల వంటి పరిశ్రమలలో ప్రైవేట్ నెట్‌వర్క్‌ల రంగంలో ఆవిష్కరణలకు అవకాశాలకు దారితీస్తుంది. 2030 నాటికి 5 కోట్ల పబ్లిక్ వై-ఫై హాట్‌స్పాట్‌లను సాధించాలనేది లక్ష్యం. 2015లో కోల్‌కతా భారతదేశపు మొట్టమొదటి వై-ఫై సౌకర్యం గల మెట్రో నగరంగా గుర్తింపు పొందింది. అయితే, వాణిజ్యపరమైన పూర్తి వైర్‌లెస్ పబ్లిక్ యాక్సెస్ విషయంలో, వారసత్వ నగరమైన మైసూరు 2005లోనే ఈ ఘనతను సాధించింది. జనవరి 2017లో, ప్రభుత్వ నిధులతో 500 పబ్లిక్ వై-ఫై హాట్‌స్పాట్‌లతో కూడిన భారీ నెట్‌వర్క్‌ను ప్రారంభించిన మొట్టమొదటి భారతీయ నగరం ముంబై నిలిచింది.

ఇంటర్నెట్ ఎప్పటినుంచో మన దైనందిన జీవితంలో అంతర్భాగంగా మారిపోయింది. ఆఫీసులో ఆన్‌లైన్ పరిశోధన, వీడియో సమావేశాల నుండి వ్యక్తిగత సంభాషణలు, వినోదం వరకు - మన జీవితంలోని ఎన్నో రంగాలు ఆన్‌లైన్‌లో భాగమవుతున్నాయి. వై-ఫై (Wi-Fi) పుణ్యమా అని, చాలా ఆధునిక క్లయింట్ పరికరాలతో ఇదంతా వైర్‌లెస్‌గా సాధ్యమవుతోంది. ప్రపంచ వై-ఫై దినోత్సవాన్ని పురస్కరించుకుని, మనం ఈ సాంకేతికత, దాని చరిత్ర మరియు భవిష్యత్తును నిశితంగా పరిశీలిద్దాం, ప్రశంసిద్దాం.

# గ్రామాల్లో పశు వైద్య శిబిరాలు ఏర్పాటు చేయండి

### కలెక్టర్ చిత్రా మిశ్రా



జనసైన్యం సిటి

గ్రామాల్లో విరివిగా పశు వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని కలెక్టర్ చిత్రా మిశ్రా.. పశు వైద్యాధికారులను ఆదేశించారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో ఆర్ అండ్ బీ గెస్ట్ హౌస్ సమీపంలో ఉన్న జిల్లా ప్రధాన పశువుల ఆసుపత్రిని కలెక్టర్ సందర్శించారు.రికార్డులు పరిశీలించారు. ఆస్పత్రి ద్వారా పశు వులకు అందిస్తున్న సేవలు, వాక్సినేషన్, మందుల వివరాలు తెలుసుకున్నారు. గదులు కలియ తిరుగుతూ ల్యాబరేటరీ, శస్త్ర చికిత్స గదులు, ఎక్స్ రే గది , మందుల గది పరిశీలించారు. సిబ్బందిని అడిగి పలు వివరాలు తెలుసుకున్నారు.

శిథిల భవనం తొలగించండి

ఆస్పత్రి ముందు శిథిలావస్థకు చేరిన పాత భవనాన్ని పరిశీలించి.. తొలగించాలని ఆర్ అండ్ బీ అధికారులను ఆదేశించారు. పాత భవనం స్థానంలో ఫౌంటెయిన్, పార్కింగ్ ప్లేస్, జంతువుల శవపరీక్ష ఏర్పాటు చేయాలన్నారు. పక్కనున్న మరో భవనాన్ని జంతువుల ఆపరేషన్ కోసం వినియోగించాలని సూచించారు.ఇక్కడున్న అన్ని పరికరాలను సద్వినియోగం చేసుకుంటూ పశువులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి లింగారెడ్డి, అసిస్టెంట్ డైరెక్టర్లు నరేష్ కుమార్, వినోద్ కుమార్ పాల్గొన్నారు.

# కరీంనగర్ జిల్లా ప్రజలకు శుభవార్త






బ్యాడ్మింటన్ . టేబుల్ టెన్నిస్ .చెస్ .క్యారం బోర్డు రంగంలో ఆసక్తిగలవారికి గంటకు 300 రూపాయల చొప్పున కోర్టును, బ్యాడ్మింటన్, టేబుల్ టెన్నిస్ .చెస్ .క్యారం బోర్డు ఆటకు ఇవ్వబడును. ముందస్తు బుకింగ్ చేసుకున్న వారికి ఇవ్వబడును

బుకింగ్ చేసుకోవాల్సిన ఫోన్ నెంబర్

9246966660

## ఆట వేళలు

ఉదయం 5 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు






మన కరీంనగర్ జిల్లా కేంద్రంలోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఇండోర్ స్టేడియంలో క్రీడాకారుల కోసం ప్రత్యేకంగా బ్యాడ్మింటన్. టేబుల్ టెన్నిస్ .క్యారం బోర్డు. చెస్. వంటి క్రీడలను ఇప్పుడు మన డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఇండోర్ స్టేడియంలో శిక్షణ ఇవ్వబడును. నిపుణులైన కోచులచే బ్యాడ్మింటన్. టేబుల్ టెన్నిస్ .చెస్ .క్యారం బోర్డు వంటి క్రీడలలో శిక్షణ ఇవ్వబడును.కరీంనగర్ జిల్లా లోని విద్యార్థినీ విద్యార్థులను మంచి క్రీడాకారులుగా తీర్చిదిద్దేందుకు నిపుణులైన కోచునులచే శిక్షణ ఇవ్వబడును.

ఆట వేళలు

ఉదయం 5 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు

ఇండోర్ స్టేడియం క్రీడాకారుల కోసం తెరిచి ఉంచబడును. కావున ఆసక్తిగల క్రీడాకారులు విద్యార్థిని విద్యార్థులు శిక్షణ కోసం మరియు ఆట ఆడుకునే అందుకోసం సంప్రదించవలసిన ఫోన్ నెంబర్.9246966660








జనచిత్రం



రమేష్ పటేల్ కు జన్మదిన శుభాకాంక్షలు



తిరుమలకు జన్మదిన శుభాకాంక్షలు



సుజాత రహీం దంపతులకు పెళ్లిరోజు శుభాకాంక్షలు

# త్యాగాల కుటుంబం రాహుల్ గాంధీ కుటుంబం




జనసైన్యం సిటి

దేశం కోసం ప్రాణాలర్పించిన కుటుంబం రాహుల్ గాంధీ కుటుంబం అని రాష్ట్ర సాంఘీక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. ధర్మపురి మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం ధర్మపురి లోని నంది చౌరస్తాలో రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర సాంఘీక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ హాజరయ్యారు. ఈసందర్భంగా మంత్రి అడ్లూరి మాట్లాడుతూ దేశ సమగ్రత, ఐక్యత కోసం రాహుల్ గాంధీ కన్యాకుమారి నుంచి కాశ్మీర్ వరకు పాదయాత్ర నిర్వహించారని మంత్రి అడ్లూరి అన్నారు.

దేశం కోసం రాహుల్ గాంధీ కుటుంబం ప్రాణత్యాగాలు చేశారని మంత్రి లక్ష్మణ్ కుమార్ గుర్తు చేశారు. దేశానికి ప్రధానమంత్రి అయ్యే అవకాశం వచ్చిన సోనియాగాంధీ, రాహుల్ గాంధీ ప్రధాన మంత్రి పదవి చేపట్టకుండా ఆర్థిక మంత్రి మన్మోహన్ సింగ్ ను ప్రధాని మంత్రి చేశారని మంత్రి అడ్లూరి అన్నారు. ప్రధానమంత్రి మోడీ పేదలకు అన్నం పెట్టే ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేసే ప్రయత్నం చేస్తున్నారని మంత్రి అడ్లూరి అన్నారు. డిల్లీ శివారులో రైతులు మద్దతు ధర కోసం ధర్నా చేస్తే రైతులపై జీను ఎక్కించిన ప్రభుత్వం బీజేపీ ప్రభుత్వం అని మంత్రి అన్నారు. ప్రధాన ప్రతిపక్ష నాయకుడిగా దేశ ఐక్యత కోసం రాహుల్ గాంధీ పని చేస్తున్నారని 2029లో రాహుల్ గాంధీని ప్రధాని మంత్రిగా చూడాలని ఇందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని మంత్రి కోరారు. కార్యక్రమంలో ధర్మపురి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చిలుముల లక్ష్మణ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సంగనభట్ల దినేష్ , తిరుపతి, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# విగ్రహా ఆవిష్కరణ చేయడం అదృష్టం



జనసైన్యం సిటి

శ్రీ ఆంజనేయ స్వామి విగ్రహా ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొనడం అదృష్టంగా భావిస్తున్నానని రాష్ట్ర సాంఘీక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ అన్నారు. జగిత్యాల రూరల్ మండలం పొలాస గ్రామంలో సహస్ర లింగాల దేవాలయ ఆవరణలో నూతనంగా ఏర్పాటు చేసిన శ్రీ ఆంజనేయ స్వామి విగ్రహాన్ని రాష్ట్ర సాంఘీక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ తో కలిసి ప్రారంభించారు. ఈసందర్భంగా ఆలయ అర్చకులు మంత్రి గారితో పాటు పూర్ణకుంభ స్వాగతం పలికారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన మంత్రి అడ్లూరి, ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ లు తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. అనంతరం ఆంజనేయ స్వామి విగ్రహాన్ని ఆవిష్కరించారు.

ఈసందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఆంజనేయ స్వామి వారి విగ్రహాన్ని తన చేతుల మీదుగా ఆవిష్కరించడం అదృష్టంగా భావిస్తున్నానని మంత్రి అన్నారు. జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్ మాట్లాడుతూ రైతులకు కరువు కాటకాలు రాకుండా చూడాలని భగవంతున్ని కోరుకున్నట్లు తెలిపారు.

ఈసందర్భంగా పార్లమెంట్ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ సీనియర్ కాంగ్రెస్ నాయకులు నాగభూషణం జన్మదిన వేడుకలు నిర్వహించారు. కేక్ కట్ చేసి రాహుల్ గాంధీ కి, జగిత్యాల మున్సిపల్ మాజీ చైర్మన్ నాగభూషణంకి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో జగిత్యాల మున్సిపల్ చైర్మన్ సమిండ్ల వాణి, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నందయ్య, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సంగనభట్ల దినేష్, ఆడువాల జ్యోతి, శంకర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా ప్రభుత్వంలో అర్హులకు ఇందిరమ్మ ఇళ్లు



జనసైన్యం సిటి

ప్రజా ప్రభుత్వంలో అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం చేస్తామని రాష్ట్ర సాంఘీక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. శుక్రవారం జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండలం గోవిందుపల్లి గ్రామంలో మంత్రి పర్యటించారు. ఈసందర్భంగా గ్రామంలో ఎస్సీ కాలనీలో డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని మంత్రి దృష్టికి గ్రామస్తులు తీసుకువచ్చారు. డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరుస్తామని మంత్రి లక్ష్మణ్ కుమార్ హామీ ఇచ్చారు. గ్రామంలో రేవేళ్ల లావణ్య శ్రీధర్ దంపతులకు మంజూరు అయిన ఇందిరమ్మ ఇంటి గృహ ప్రవేశ కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. ఈసందర్భంగా మంత్రి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం పేద ప్రజల స్వంతింటి కల నెరవేర్చడానికి కృషి చేస్తుందని అన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని మంత్రి హామీ ఇచ్చారు. అనంతరం పార్లమెంట్ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు నిర్వహించారు. కేక్ కట్ చేసిన మంత్రి అడ్లూరి రాహుల్ గాంధీ కి శుభాకాంక్షలు తెలిపారు.

## మినిస్టర్ క్వార్టర్స్‌లో రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు



**జనసైన్యం సిటి**

మినిస్టర్ క్వార్టర్స్‌లో కాంగ్రెస్ అగ్ర నాయకులు, ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ గారి జన్మదిన వేడుకలు నిర్వహించిన మంత్రి పొన్నం ప్రభాకర్.కాంగ్రెస్ నాయకు, కార్యకర్తలు, అభిమానుల మధ్య కేక్ కట్ చేసి రాహుల్ గాంధీ గారి కి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన మంత్రి పొన్నం ప్రభాకర్ .మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ..ప్రపంచ దేశాల్లోనే ఒక రాజకీయ నాయకుడు గా మానవతా హృదయం కలిగిన రాహుల్ గాంధీ గారికి జన్మదిన శుభాకాంక్షలు .భారత్ జోడోయాత్ర ద్వారా దేశ వ్యాప్తంగా అందరూ కలిసి ప్రజాస్వామికంగా ఉండాలని నఫ్రత్ చోడో భారత్ జోడో అని ఎటువంటి విద్వేషాలతో బతకద్దని పిలుపునిచ్చిన వ్యక్తి..రాహుల్ గాంధీ గారు బావి భారత జన్ జడ్ ఆకాంక్షల ఘనంగా ప్రధాని కావాలి .రాహుల్ గాంధీ గారు భారతదేశానికి దిశా దశ మారుస్తారు .జిత్నే అబాది ఉత్నే ఇసెదరి అని దేశవ్యాప్తంగా బలహీన వర్గాల ప్రజలకు న్యాయం జరగాలని ఆశతో ఎదురు చూస్తున్న సందర్భంలో రాహుల్ గాంధీ పిలుపునిచ్చారు.రాహుల్ గాంధీ గారికి జన్మదిన సందర్భంగా వారికి ఆ భగవంతుడు అన్ని రకాల శక్తిని ఇవ్వాలని ప్రార్థిస్తున్నా..

## ఏఐ & డిజిటల్ లెర్నింగ్ ఘనంగా రెండు రోజుల శిక్షణ ప్రారంభం




**జనసైన్యం సిటి**

ప్రభుత్వ డిగ్రీ మహిళా కళాశాల (స్వయంప్రతిపత్తి), కరీంనగర్‌లో అన్నా అక్కా మెంటర్‌షిప్ కార్యక్రమం కింద “ఏఐ ఒ డిజిటల్ లెర్నింగ్” పై రెండు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని ఘనంగా ప్రారంభించారు. అధ్యాపకులు మరియు తుది సంవత్సరం విద్యార్థుల కోసం నిర్వహిస్తున్న ఈ కార్యక్రమం ద్వారా కృత్రిమ మేధస్సు (AI) మరియు డిజిటల్ సాంకేతికతలపై అవగాహనతో పాటు ప్రాయోగిక పరిజ్ఞానాన్ని అందించడం లక్ష్యంగా పెట్టుకున్నారు.ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ డి. వరలక్ష్మి మాట్లాడుతూ, నేటి ఆధునిక ప్రపంచంలో కృత్రిమ మేధస్సు ప్రాధాన్యత రోజురోజుకూ పెరుగుతోందని పేర్కొన్నారు. విద్యార్థులు ఈ శిక్షణను పూర్తిగా సద్వినియోగం చేసుకుని సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. విద్య, పరిశోధన, ఆవిష్కరణలు మరియు ఉపాధి అవకాశాలలో AI కీలక పాత్ర పోషిస్తోందని, దాని బాధ్యతాయుత వినియోగం విద్యార్థులను భవిష్యత్తు సవాళ్లను ఎదుర్కొనేలా తీర్చిదిద్దుతుందని తెలిపారు. అలాగే తుది సంవత్సరం విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలలకు వెళ్లి AI మరియు డిజిటల్ లెర్నింగ్‌పై అవగాహన కల్పించే విధంగా శిక్షణ పొందనున్నారని, ఇది విద్యా రంగంలో డిజిటల్ సాధికారతకు ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలకు బలోపేతంగా నిలుస్తుందని పేర్కొన్నారు.పరీక్షల నియంత్రణాధికారి డా. జి. శ్రీనివాస్ మాట్లాడుతూ, విద్యార్థులు ఈ రెండు రోజుల శిక్షణా కార్యక్రమాన్ని సమర్థవంతంగా వినియోగించుకుని తమ విద్యా, వృత్తిపరమైన అభివృద్ధికి అవసరమైన ఆధునిక నైపుణ్యాలను పెంపొందించుకోవాలని సూచించారు.నోడల్ అధికారి డా. ఎం. కల్పన మాట్లాడుతూ, ఈ కార్యక్రమం ద్వారా తుది సంవత్సరం విద్యార్థులకు AI మరియు డిజిటల్ లెర్నింగ్ అంశాలపై సమగ్ర అవగాహన కల్పించడమే కాకుండా, ప్రభుత్వ పాఠశాలలలో 4వ తరగతి నుండి 9వ తరగతి వరకు విద్యార్థులకు శిక్షణ అందించే సామర్థ్యాన్ని పెంపొందించడం లక్ష్యమని తెలిపారు. ఈ శిక్షణ మరియు పాఠశాల అవుట్‌రీచ్ కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేసిన విద్యార్థులకు వారి తుది సంవత్సరం అకడమిక్ రికార్డులో రెండు అకడమిక్ క్రెడిట్లు జత చేయబడతాయని వివరించారు.నోడల్ అధికారి డా. ఆర్. మొగిలి మాట్లాడుతూ, ఈ కార్యక్రమం ద్వారా పాల్గొనేవారికి AI సాధనాల వినియోగంలో ప్రాయోగిక అనుభవం లభిస్తుందని, డిజిటల్ నైపుణ్యాలు మెరుగుపడతాయని, పాఠశాల విద్యార్థులకు సమర్థవంతంగా శిక్షణ అందించే సామర్థ్యం పెరుగుతుందని తెలిపారు. గ్రామీణ స్థాయిలో ఘా× అవగాహనను విస్తరించగల విద్యార్థి మార్గదర్శకుల బృందాన్ని ఈ కార్యక్రమం రూపొందిస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమానికి నోడల్ అధికారిణి శ్రీమతి జె. స్వప్న వ్యాఖ్యాతగా వ్యవహరించారు.ఈ శిక్షణను శ్రీ అరవింద్ కుమార్ నాయిని, శ్రీ చైతన్య ఇంజినీరింగ్ కళాశాలకు చెందిన అధ్యాపకులు నిర్వహిస్తున్నారు. ఆయన రెండు రోజుల పాటు అధ్యాపకులు మరియు తుది సంవత్సరం విద్యార్థులకు ఘా× మరియు డిజిటల్ లెర్నింగ్‌పై ప్రాయోగిక శిక్షణ అందించనున్నారు.ప్రారంభ కార్యక్రమంలో అక్కడ మీకు కోఆర్డినేటర్ డాక్టర్ నల్ల మనోజ్ కుమార్, డాక్టర్ మురళి, డాక్టర్ విద్య అధ్యాపకులు మరియు విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని శిక్షణా కార్యక్రమం విజయవంతం కావాలని ఆకాంక్షించారు. AI ఆధారిత విద్యా విధానాలను గ్రామీణ స్థాయికి తీసుకెళ్లే దిశగా ఈ కార్యక్రమం ఒక కీలక ముందడుగుగా నిలుస్తుందని పలువురు అభిప్రాయపడ్డారు.

## శాతవాహన యూనివర్సిటీ విద్యార్థుల న్యాయమైన డిమాండ్లపై ప్రభుత్వం వెంటనే స్పందించాలి

విద్యార్థులు ప్రధానంగా ఈ క్రింది డిమాండ్లను ముందుకు తీసుకువచ్చారు:
1. 5వేయిల పోలీస్ కానిస్టేబుల్ (P C) మరియు సబ్-ఇన్‌స్పెక్టర్ (SI) పోస్టులు వొద్దు ,20,000 పోస్టులతో భారీ నోటిఫికేషన్ విడుదల చేయాలి.2. FBO (Forest Beat Officer) పోస్టులు సైతం పెంచి నియామక ప్రక్రియను వెంటనే ప్రారంభించాలి.3. ప్రభుత్వం ఏర్పడిన వెంటనే 2లక్షల ఉద్యోగాల భర్తీ చేస్తామని ఇచ్చిన హామీని నెరవేర్చాలి .4. నిరుద్యోగులకు నష్టం కలిగిస్తున్న +.ా. 46 ను రద్దు చేయాలి.5. ఉద్యోగ నోటిఫికేషన్ ల కోసం రాష్ట్రవ్యాప్తంగా శాంతి యుత నిరసనలు చేస్తున్న నిరుద్యోగుల పైన పెట్టిన అక్రమ కేసులను వెంటనే ఎత్తివేయాలి .ఈ సందర్భంగా విద్యార్థులు మాట్లాడుతూ, యువత భవిష్యత్తుతో ముడిపడి ఉన్న ఈ అంశాలపై ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాలని, లేదంటే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.“మా హక్కులు -మా పోరాటం” అనే నినాదంతో విద్యార్థులు తమ డిమాండ సాధన కోసం ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు.శాతవాహన యూనివర్సిటీ విద్యార్థులు.

**జనసైన్యం సిటి**



## ట్రంప్ తో - మోదీ స్నేహం? కుక్క తోక పట్టుకొని గోదావరి ఈదినట్లే



**డాక్టర్ కోలాహలం రామ్ కిశోర్**

డోనాల్డ్ ట్రంప్ రెండోసారి అమెరికా అధ్యక్షుడిగా ఎన్నికైన తర్వాత భారత్-అమెరికా సంబంధాలపై మళ్లీ తీవ్రమైన చర్చ మొదలైంది. భారతీయ ప్రధాన స్రవంతి మీడియా, అధికార పార్టీ అనుకూల వర్గాలు చాలా కాలంగా ట్రంప్-మోదీ వ్యక్తిగత స్నేహాన్ని ఒక గొప్ప దౌత్య విజయంగా చిత్రీకరించాయి. “హౌడీ మోదీ”, “నమస్తే ట్రంప్” వంటి భారీ కార్యక్రమాలు, ఒకరిపై ఒకరు చేసుకున్న ప్రశంసలు చూసి చాలామంది భారత్‌కు అమెరికాతో ప్రత్యేక సన్నిహిత సంబంధాలు ఏర్పడ్డాయని భావించారు. కానీ అంతర్జాతీయ రాజకీయాలను శాసించేది... వ్యక్తిగత స్నేహాలు కాదు, జాతీయ ప్రయోజనాలే నిర్ణయిస్తాయని ట్రంప్ పాలన మరోసారి స్పష్టంగా నిరూపించి చూపించింది.

లెఫ్టిస్టు, సామ్రాజ్యవాద వ్యతిరేక విశ్లేషకులు చాలా కాలంగా చెబుతున్న ఒక విషయం ఏమిటంటే, “అమెరికా ఏ దేశాన్నీ శాశ్వత మిత్రుడి” గా చూడదు. “తన ఆర్థిక, సైనిక, భౌగోళిక రాజకీయ ప్రయోజనాలకు ఉపయోగపడేంత వరకు మాత్రమే సంబంధాలను కొనసాగిస్తుంది” . ట్రంప్ విధానాలు కూడా అదే వాస్తవాన్ని మరింత బహిర్గతం చేశాయి.

భారత్‌పై అమెరికా విధించిన అధిక టారిఫ్‌లు దీనికి ఒక ఉదాహరణ. ట్రంప్ “అమెరికా ఫస్ట్” విధానం పేరిట మిత్రదేశాలపై కూడా సుంకాలు విధించాడు. భారత్‌పై కూడా అనేక వస్తువులపై అదనపు టారిఫ్‌లు అమలు చేశాడు. అమెరికా ఉత్పత్తులకు భారత మార్కెట్ మరింత తెరవాలని, వ్యవసాయం నుంచి ఈ-కామర్స్ వరకు అనేక రంగాల్లో అమెరికన్ కంపెనీలకు అవకాశాలు కల్పించాలని ఒత్తిడి తెచ్చాడు. మరోవైపు భారత ఎగుమతులపై ఆంక్షలు కొనసాగించాడు. ఇది సమాన భాగస్వామ్యం కంటే అమెరికన్ కార్పొరేట్ ప్రయోజనాలకు ప్రాధాన్యత ఇచ్చే విధానంగా విమర్శలు ఎదుర్కొంది.

భారత రైతుల విషయంలో కూడా ఆందోళనలు వ్యక్తమయ్యాయి. అమెరికా వ్యవసాయ ఉత్పత్తులకు భారత మార్కెట్ పూర్తిగా తెరవబడితే, ఇప్పటికే సంక్షోభంలో ఉన్న భారత రైతులు మరింత పోటీని ఎదుర్కోవాల్సి వస్తుందని రైతు సంఘాలు, వ్యవసాయ నిపుణులు హెచ్చరిస్తున్నారు. అమెరికాలో భారీ సబ్సిడీలతో ఉత్పత్తి అయ్యే వ్యవసాయ వస్తువులు భారత మార్కెట్లోకి వస్తే, చిన్న రైతుల జీవనోపాధిపై తీవ్ర ప్రభావం పడే అవకాశం ఉందని విమర్శకులు అంటున్నారు.

భారత విదేశాంగ స్వతంత్రతపై కూడా ట్రంప్ పరిపాలన ఒత్తిడి తీసుకొచ్చిందని విమర్శలు ఉన్నాయి. రష్యా, ఇరాన్, వెనిజులా వంటి దేశాల నుంచి చౌక ధరలకు చమురు కొనుగోలు చేయడాన్ని అమెరికా తరచూ వ్యతిరేకించింది. అంతర్జాతీయ మార్కెట్లో శక్తి భద్రత ప్రతి దేశానికి కీలకమైన అంశం. ఒక సార్వభౌమ దేశం తన అవసరాలకు అనుగుణంగా ఎక్కడి నుంచి చమురు కొనాలనేది తానే నిర్ణయించుకోవాలి. కానీ అమెరికా ఆంక్షల రాజకీయాల ద్వారా ఇతర దేశాల నిర్ణయాలను ప్రభావితం చేయాలని ప్రయత్నించడం సామ్రాజ్యవాద ధోరణికి నిదర్శనమని వామపక్ష విశ్లేషకులు పేర్కొంటున్నారు.

అమెరికాలో భారతీయ విద్యార్థులు, వలస ఉద్యోగులు ఎదుర్కొన్న సమస్యలు కూడా ఆందోళన కలిగించాయి. వీసా నిబంధనల కఠినతరం, వలస విధానాల మార్పులు, విదేశీయులపై



అనుమానాస్పద వైఖరి అనేక భారతీయ కుటుంబాలను ప్రభావితం చేశాయి. అమెరికా ఆర్థిక వ్యవస్థలో భారతీయుల పాత్ర గణనీయమైనప్పటికీ, ట్రంప్ రాజకీయాలు తరచుగా వలసదారులను సమస్యగా చిత్రీకరించాయని విమర్శలు వచ్చాయి. అక్రమ వలసదారులుగా గుర్తించిన కొందరు భారతీయులను అమెరికా నుంచి బహిష్కరించిన విధానం కూడా పెద్ద వివాదానికి దారితీసింది. సంకెళ్లు వేసి సైనిక విమానాల్లో పంపించడం భారత గౌరవాన్ని దెబ్బతీసే చర్యగా భారత ప్రతిపక్షాలు, మానవ హక్కుల సంస్థలు విమర్శించాయి. ఒక దేశ పౌరుల పట్ల వ్యవహరించే తీరు రెండు దేశాల సంబంధాల నాణ్యతను ప్రతిబింబిస్తుందని వారు పేర్కొన్నారు.

భారత్-పాకిస్తాన్ సంబంధాల విషయంలో ట్రంప్ వైఖరి మరింత వివాదాస్పదంగా మారింది. కాశ్మీర్ అంశంలో తాను మధ్యవర్తిత్వం చేస్తానని పలుమార్లు చేసిన వ్యాఖ్యలు భారత అధికారిక విధానానికి వ్యతిరేకంగా ఉన్నాయి. కాశ్మీర్ పూర్తిగా ద్వైపాక్షిక అంశమని భారత్ దశాబ్దాలుగా చెబుతోంది. అయినప్పటికీ అమెరికా అధ్యక్షుడు ఆ అంశంలో జోక్యం చేసుకోవడానికి సిద్ధమని ప్రకటించడం భారత విదేశాంగ విధానానికి సవాలుగా భావించబడింది.

పహెల్గాం వంటి ఉగ్రదాడుల తర్వాత కూడా అమెరికా నుంచి భారత ఆశించినంత స్పష్టమైన మద్దతు రాలేదని విమర్శలు వచ్చాయి. మరోవైపు పాకిస్తాన్ సైనిక నాయకత్వంతో ట్రంప్ సన్నిహితంగా వ్యవహరించడం, పాకిస్తాన్‌కు అంతర్జాతీయ ఆర్థిక సంస్థల సహాయం కొనసాగడంలో అమెరికా పాత్ర ఉందనే ఆరోపణలు భారత రాజకీయ వర్గాల్లో వినిపించాయి. భారత భద్రతా ఆందోళనల కంటే అమెరికా తన ప్రాంతీయ వ్యూహాత్మక ప్రయోజనాలకు ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చిందని విమర్శకులు అంటున్నారు.

అంతర్జాతీయ మీడియా కూడా తరచుగా ఒక విషయాన్ని గుర్తు చేస్తోంది. “అమెరికా విదేశాంగ విధానం వ్యక్తులపై కాకుండా శక్తి సమీకరణాలపై ఆధారపడి ఉంటుంది”.

మోదీని వ్యక్తిగతంగా ప్రశంసించిన ట్రంప్, అదే సమయంలో భారత ప్రయోజనాలకు వ్యతిరేకంగా కనిపించే నిర్ణయాలు తీసుకోవడంలో వెనుకాడలేదు. ఇది వ్యక్తిగత సంబంధాలు మరియు దేశ ప్రయోజనాలు వేర్వేరు అంశాలని స్పష్టం చేస్తుంది.

భారత ప్రతిపక్షాలు కూడా ఇదే అంశాన్ని ప్రస్తావిస్తున్నాయి. “ భారత విదేశాంగ విధానాన్ని వ్యక్తిగత స్నేహాల ప్రచారంగా మార్చడం ప్రమాదకరమని, అంతర్జాతీయ సంబంధాలు పరస్పర గౌరవం, సమానత్వం, వ్యూహాత్మక ప్రయోజనాల ఆధారంగా నిర్మించబడాలని” అవి వాదిస్తున్నాయి. అలాగే “విదేశాంగ విజయాలను భారీ సభలు, ఆలింగనాలు, వ్యక్తిగత ప్రశంసలతో కొలవడం సరైన ప్రమాణం కాదని” చెబుతున్నాయి.

విమర్శనాత్మక దృక్పథంలో చూస్తే “ సమస్య ట్రంప్ వ్యక్తిత్వంలో మాత్రమే లేదు. అమెరికా సామ్రాజ్యవాద విధానాల స్వభావంలోనే ఉంది” .” ప్రపంచ మార్కెట్లపై ఆధిపత్యం, చమురు వనరులపై నియంత్రణ, అంతర్జాతీయ ఆర్థిక సంస్థల ద్వారా ప్రభావం, సైనిక కూటముల ద్వారా రాజకీయ ఒత్తిడి” ఇవన్నీ... అమెరికా ప్రపంచ వ్యూహంలో భాగమని ఈ విశ్లేషణ చెబుతుంది. ట్రంప్ ఆ విధానాలను మరింత దూకుడుగా అమలు చేసిన నాయకుడిగా మాత్రమే కనిపిస్తాడు.

భారత్‌కు అవసరమైనది ఏ ఒక్క మహాశక్తిపై ఆధారపడని స్వతంత్ర విదేశాంగ విధానం కావాలి. అమెరికా, రష్యా, చైనా, యూరోప్, గ్లోబల్ సౌత్ దేశాలతో సమతుల్య సంబంధాలు కొనసాగిస్తూ జాతీయ ప్రయోజనాలను కాపాడుకోవడం ముఖ్యం. “వ్యక్తిగత నాయకుల మధ్య స్నేహాల కంటే దేశ ప్రయోజనాలు, ప్రజల సంక్షేమం, ఆర్థిక స్వావలంబన, వ్యూహాత్మక స్వతంత్రతే ప్రధానంగా” ఉండాలి.

ట్రంప్-మోదీ సంబంధాల అనుభవం ఇచ్చే ప్రధాన పాఠం ఇదే. “ అంతర్జాతీయ రాజకీయాల్లో శాశ్వత మిత్రులు ఉండరు; శాశ్వత ప్రయోజనాలు మాత్రమే” ఉంటాయి. అమెరికా “భారత్‌కు గొప్ప మిత్రుడు” అనే నినాదాన్ని ఎంతగా ప్రచారం చేసినా, తన ప్రయోజనాల విషయంలో అది ఎప్పుడూ అమెరికానే ముందుగా చూస్తుంది. అందువల్ల “భారత విదేశాంగ విధానం కూడా భావోద్వేగాలపై కాదు, వాస్తవాలపై, స్వతంత్ర జాతీయ ప్రయోజనాలపై” ఆధారపడాల్సిన అవసరం గతంలో కంటే ఇప్పుడు మరింత స్పష్టంగా కనిపిస్తోంది.

# ఓ మనిషి నీజీవితం

ఓ మనిషి నీజీవితం
ఆనంద లహరి కావాలి
మనిషి జీవిత చక్రంలో
ఆందోళనలు ఆనందాలు
అంతర్భాగాలు
ఓమనిషి రేపటి కొరకు
ఎదురుచూస్తూ
ఈ క్షణాన్ని వృథాచేయకు
మీనా మేషాలు లెక్కిస్తూ
కూర్చోకు సకాలంలో
స్పందించే శక్తిని పెంచుకో
ఇప్పుడు చేయాల్సిన
పని మీద దృష్టిపెట్టు
ఆనందం అంగడి సరుకుకాదు
కొంటె మార్కెట్లో దొరకదు
ఆనందం అనేది మనసులో
పుడుతుంది ఆనందం అనేది
ఒక కళ దానిని ఇప్పుడే
ఆస్వాదించడం మరవద్దు
డబ్బులో లేదు అసలైన
సంతోషం మనసు విప్పి
మాట్లాడే స్నేహంలో ఉంది
చిన్న నాటి స్నేహితుల
చిలిపిచేష్టలజ్ఞాపకాల్లో ఉంది
పాత స్నేహితుల మాటల్లోఉంది
అలసటను మరిపించే
అమ్మ ప్రేమలో ఉంది
తోడుగా నిలిచే నాన్న
ధైర్యంలో ఉంది
ఆత్మీయుల పలకరింపులో ఉంది
ఉదయాన్నే చేసే చక్కని
వ్యాయామంలో ఉంది
శ్వాసపై ధ్యాస ధ్యానంతో
శరీరానికిచ్చే కొత్త
ఉత్సాహంలో ఉంది
యోగాసనాలతో పొందే
మనశ్శాంతిలో ఉంది
ఆరోగ్యమే మహా భాగ్యం
అనే జీవనశైలిలో ఉంది
కొత్తలోకాన్ని చూపే
ప్రయాణాల్లో ఉంది
తెలియని దారుల్లో సాగే
అన్వేషణల్లో ఉంది
కొండలు కొనలు దాటి
పారే జలపాతాల్లో ఉంది
ప్రకృతి అందాలను చూసి
పరవశించడంలో ఉంది
ప్రకృతి ఒడిలో
సముద్రపు తీరాల్లో
పచ్చని చెట్లలో పక్షుల
కిలకిల రావాల్లో ఉంది
పసిపాప అమాయకపు
చిరునవ్వులో ఉంది
పరులకుచేసేసహాయంలో ఉంది
నిస్వార్థ స్వచ్ఛంద సేవలో ఉంది
కష్టాల్లో ఉన్న వారిని
ఆదుకునే హృదయంలో ఉంది
నచ్చినపుస్తకంచదవడంలో ఉంది
మనసుకు నచ్చిన
సంగీతం వినడంలో ఉంది
మనపై మనకున్న
విశ్వాసంలోనే
సంతృప్తి సంతోషం ఉంది
దాచిపెడితే పెరగదు సంతోషం
సంతోషాన్నీ పెంచాలి పంచాలి
అప్పుడే సంతోషం ఆనందం
రెట్టింపు అవుతుంది
మానవ జన్మ సార్థకమౌతుంది
వాయిదా పద్ధతిని కాలానికి
వదిలేయ్ ఈ క్షణంలోనే
మనస్ఫూర్తిగా బతికేయ్
ఈ క్షణాన్ని ఆస్వాదిస్తేనే
సంతోషాన్ని ఆనందాన్ని అనుభవిస్తాం
చింతలకు దూరంగా
ప్రశాంతతకు దగ్గరగా
జీవిద్దాం మానవ జన్మ
సార్థకతకు స్ఫూర్తిగా నిలుద్దాం



నేదునూరి కనకయ్య

## నగరపాలక సంస్థ పార్క్ ఆధునీకరణకు వేగంగా చర్యలు



**జనసైన్యం సిటి**

నగరంలోని జిల్లా పరిషత్ క్వార్టర్స్ లో ఉన్న నగరపాలక సంస్థ పార్కును త్వరలోనే సర్వాంగ సుందరంగా ముస్తాబు చేయనున్నట్లు బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, కరీంనగర్ నగరపాలక సంస్థ డిప్యూటీ మేయర్ మరియు మాజీ మేయర్ యాదగిరి సునీల్ రావు తెలిపారు. పార్కు ఆధునీకరణ పనుల్లో భాగంగా ఆయన పార్కును సందర్శించి, క్షేత్రస్థాయిలో పరిస్థితులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మున్సిపల్ అధికారులతో మాట్లాడుతూ, పార్కులో నిరుపయోగంగా ఉన్న పలు సౌకర్యాలను వెంటనే పునరుద్ధరించాలని ఆదేశించారు. పాడైపోయిన ఫౌంటెన్‌ను వెంటనే బాగుచేసి అందుబాటులోకి తీసుకురావాలి. పాడైపోయిన బాత్‌రూమ్‌లు మరియు దెబ్బతిన్న వాకింగ్ ట్రాక్ ను మెరుగుపరచాలి.ఆహ్లాదకరమైన వాతావరణం కోసం గ్రీనరీ (పచ్చదనం) పెంపొందించాలి.రాత్రి వేళల్లో సౌకర్యార్థం పార్కులో తగినంత లైటింగ్ తో పాటు ఇతర మౌలిక వసతులు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. చుట్టుపక్కల ఉన్న సుమారు నాలుగు, ఐదు డివిజన్ల నుంచి 400 నుంచి 500 మంది ప్రజలు ప్రతిరోజూ ఈ పార్కుకు వస్తుంటారని, వారి సౌకర్యార్థం రాబోయే రెండు మూడు మాసాల లోపల పార్కును పూర్తిగా ఆధునీకరించి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని ఆయన స్పష్టం చేశారు. సరిగ్గా పది సంవత్సరాల క్రితం అప్పట్లో రూ. 52 లక్షల వ్యయంతో ఈ పార్కును నిర్మించి ప్రారంభించినట్లు ఆయన గుర్తుచేశారు. తిరిగి ఇప్పుడు ఈ పార్కును ఆధునీకరించి,అధునాతన సౌకర్యాలు నగర ప్రజలకు పూర్తిస్థాయిలో ఆహ్లాదాన్ని, సౌకర్యాలను అందించేందుకు కృషి చేస్తున్నామని యాదగిరి సునీల్ రావు తెలియజేశారు.

## కరీంనగర్ పెద్దమ్మ గుడి బోనాల ఉత్సవాలకు పూర్తి వసతులు

**జనసైన్యం సిటి**



గత 50 సంవత్సరాలుగా ఆరుద్ర చివరి పాదంలో అత్యంత వైభవంగా నిర్వహిస్తున్న ముదిరాజుల ఆరాధ్య దైవం 'శ్రీశ్రీశ్రీ పెద్దమ్మతల్లి బోనాల జాతర' ఈ సంవత్సరం కూడా జులై 5, 2026 (ఆదివారం) నాడు ఘనంగా జరగనుంది. గత సంవత్సరాల తరహాలోనే ఈ ఏడాది కూడా నగరపాలక సంస్థ ద్వారా ఉత్సవాలకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని కోరుతూ పట్టణ ముదిరాజ్ సంఘం నాయకులు.. బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, కరీంనగర్ నగరపాలక సంస్థ డిప్యూటీ మేయర్ మరియు మాజీ మేయర్ యాదగిరి సునీల్ రావు గారికి వినతిపత్రం ఇవ్వడం జరిగింది. ఈ విజ్ఞప్తిపై శ్రీ యాదగిరి సునీల్ రావు సానుకూలంగా స్పందించారు. బోనాల పండుగను ఘనంగా, ఎలాంటి ఆటంకాలు లేకుండా నిర్వహించేందుకు నగరపాలక సంస్థ పక్షాన పూర్తి సహకారం ఉంటుందని ఈ సందర్భంగా ఆయన స్పష్టం చేశారు. ఉత్సవాలకు విచ్చేసే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా భక్తుల దాహార్తిని తీర్చేందుకు సురక్షితమైన త్రాగునీటి ఏర్పాటు. ఎండ, వానల బారి నుండి భక్తులకు రక్షణ కల్పించేందుకు ఆలయ పరిసరాల్లో టెంట్లు వేయడం. రాత్రి సమయాల్లో భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా ప్రత్యేక విద్యుత్ దీపాల ఏర్పాటు. జాతర జరిగే రోజుల్లో ఎప్పటికప్పుడు చెత్తను తొలగిస్తూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేలా సౌకర్యాలను తప్పకుండా కల్పిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పట్టణ ముదిరాజ్ సంఘం అధ్యక్షులు కొలకాని నర్సయ్య ముదిరాజ్, ప్రధాన కార్యదర్శి పండుగ నాగరాజు ముదిరాజ్, కార్యవర్గ సభ్యులు కుంభం రాజయ్య, ఏంద్ర శ్రీనివాస్, జెట్టి బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

## పాల ఉత్పత్తి దారుల సంఘం అధ్యక్షుడిగా నాయిని మల్లేశం



**జనసైన్యం సిటి**

ఇల్లంతకుంట మండలం వల్లంపట్ల గ్రామంలో కరీంనగర్ డైరీ ఆధ్వర్యంలో నడుస్తున్న పాల ఉత్పత్తిదారుల సంఘం అధ్యక్షుడిగా నాయిని మల్లేశం ఏడోసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాల ఉత్పత్తిదారుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలోసూపర్వైజర్ వెంకట్ రాంరెడ్డి,చంద్రారెడ్డి, ముత్యం రెడ్డి, మోహన్ రెడ్డి, ప్రతాప్ రెడ్డి, వెంకట్ రెడ్డి, జలపతి రెడ్డి, రాజయ్య, కొమురయ్య, రాజు తదితరులు పాల్గొన్నారు.

## చౌటపల్లి గ్రామ శివారులోని పెద్దమ్మ గుడిలో దొంగతనం



**జనసైన్యం సిటి**

సిద్దిపేట జిల్లా అక్కన్నపేట మండలం చౌటపల్లి గ్రామ శివారులోని పెద్దమ్మ గుడిలో దొంగతనం స్థానికంగా కలకలం రేపింది. గుర్తు తెలియని దుండగులు అర్ధరాత్రి గుడిలోకి ప్రవేశించి 25 వేల విలువగల అమ్మవారి పంచలోహ విగ్రహం, 20 వేల విలువ గల మైక్ సెట్ అపహరించుకు వెళ్లినట్లు స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. అదేవిధంగా దేవాలయంలోని హుండీ పగలగొట్టి వేయి రూపాయల నగదు ఎత్తుకెళ్లారు. ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. గతంలో కూడా ఇదే దేవాలయంలో గుర్తు తెలియని దుండగులు గుడిగంటలు ఎత్తుకెళ్లిన ఘటన జరగడం గమనార్హం.

## ప్రమాద బాధితులను పరామర్శించిన ఎమ్మెల్యే డా. మేడిపల్లి సత్యం

**జనసైన్యం సిటి**



చొప్పదండి నియోజకవర్గం గంగాధర మండలంలోని వివిధ ప్రమాదాల్లో గాయపడి జిల్లా కేంద్రంలోని సన్‌రైజ్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న బాధితులను చొప్పదండి శాసనసభ్యులు, కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు డా. మేడిపల్లి సత్యం ఈరోజు ప్రత్యక్షంగా సందర్శించి పరామర్శించారు.గంగాధర మండలం బూరుగుపల్లి గ్రామానికి చెందిన కల్లుగీత కార్మికుడు బత్తిని శ్రీనివాస్ గౌడ్ ప్రమాదవశాత్తూ తాడిచెట్టు పైనుంచి పడి తీవ్రంగా గాయపడ్డారు. అలాగే, ఉప్పారమల్యాల గ్రామానికి చెందిన పారిశుధ్య కార్మికుడు లంకదాసరి మల్లయ్య రోడ్డు ప్రమాదానికి గురై అదే హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్నారు.ఈ విషయాలు తెలుసుకున్న ఎమ్మెల్యే డా. మేడిపల్లి సత్యం గారు తక్షణమే హాస్పిటల్‌కు చేరుకుని బాధితులను, వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని, ధైర్యం చెప్పారు. అనంతరం బాధితులకు మెరుగైన వైద్యం అందించాలని హాస్పిటల్ వైద్యులను ఆదేశించారు. ప్రభుత్వం మరియు పార్టీ తరపున బాధితుల కుటుంబాలకు అన్ని విధాలా అండగా ఉంటామని ఈ సందర్భంగా ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దుబ్బాసి బుచ్చయ్య,మాజీ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పురుమల్ల మనోహర్,జిల్లా కాంగ్రెస్ కార్యదర్శి బైరిశెట్టి సంపత్,బిసి సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు పులి ఆంజనేయులు గౌడ్ మరియు స్థానిక కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.



అభిలాష్ కు జన్మదిన శుభాకాంక్షలు



అరవింద్ కుమార్ కు జన్మదిన శుభాకాంక్షలు



ఆనంద్ కు జన్మదిన శుభాకాంక్షలు

# దునియా అంత ఒక వైపు - సమాచార హక్కు చట్టం ఒక వైపు



సోరుపాక అనిల్ కుమార్

-సామాన్యుని హక్కులను ఎవరూ హరించలేరు
-అవినీతి, అక్రమాలు తాత్కాలికమే
-అధికారుల అసలు రూపాన్ని బయటపెడుతున్న ఆర్‌టీఐ
-ప్రజా సమాచారాన్ని రహస్యంగా ఉంచడం ప్రజాస్వామ్యానికి ముప్పు
-కోసరు సమాచారాన్ని వెబ్‌సైట్లలో ఉంచి, అసలు సమాచారాన్ని దాచకూడదు
-సామాన్యుడి చేతిలో చట్టబద్ధమైన రక్షణ ఆయుధం -- సమాచార హక్కు చట్టం

ప్రజాస్వామ్యంలో ప్రభుత్వం ప్రజలకు జవాబుదారీగా ఉండాలంటే, ప్రజలకు సమాచారం అందుబాటులో ఉండాలి. ఈ లక్ష్యంతోనే 2005లో సమాచార హక్కు చట్టం (ఆర్ టి ఐ యాక్ట్, 2005) అమలులోకి వచ్చింది. ఈ చట్టం భారత పౌరుడికి ప్రభుత్వ శాఖల వద్ద ఉన్న సమాచారాన్ని కోరే చట్టబద్ధమైన హక్కును కల్పించింది. ప్రభుత్వ పరిపాలనలో పారదర్శకత పెంచడం, జవాబుదారీతనం తీసుకురావడం, అవినీతిని తగ్గించడం ఈ చట్టం ప్రధాన ఉద్దేశం.


సమాచార హక్కు చట్టం అమల్లోకి వచ్చిన తర్వాత దేశంలో ఎన్నో అవినీతి వ్యవహారాలు వెలుగులోకి వచ్చాయి. ప్రజలకు న్యాయం జరిగింది. ప్రభుత్వ నిర్ణయాల్లో పారదర్శకత పెరిగింది. అందుకే ఈ చట్టాన్ని కేవలం ఒక దరఖాస్తు విధానంగా కాకుండా, ప్రజాస్వామ్యాన్ని కాపాడే శక్తివంతమైన సాధనంగా చూడాలి.

అయితే, చట్టం అమల్లోకి వచ్చి రెండు దశాబ్దాలు పూర్తవుతున్నా, ఇప్పటికీ అనేక ప్రభుత్వ కార్యాలయాల్లో ఒకే ప్రశ్న వినిపిస్తోంది. "ఆ సమాచారం వెబ్‌సైట్‌లో ఉంది కదా... మళ్లీ ఆర్ టి ఐ ఎందుకు వేశారు?"

ఈ ప్రశ్న సహజంగా అనిపించినా, సమాచార హక్కు చట్టం అసలు ఉద్దేశాన్ని పూర్తిగా అర్థం చేసుకోలేదనే భావన కలుగుతుంది. వెబ్‌సైట్‌లో సమాచారం ఉంచడం ఒక ప్రభుత్వ బాధ్యత. కానీ పౌరుడు కోరిన సమాచారాన్ని చట్టం ప్రకారం, అవసరమైతే ధృవీకరించిన ప్రతులతో అందించడం మరో ప్రత్యేక బాధ్యత. ఈ రెండింటినీ ఒకేలా చూడలేం.

ప్రతి పౌరుడూ ఉన్నత విద్యావంతుడు కాదు. ప్రతి ఒక్కరికీ ఇంగ్లీష్ భాష తెలియదు. ప్రతి ఒక్కరి వద్ద కంప్యూటర్, స్మార్ట్‌ఫోన్ లేదా ఇంటర్నెట్ సౌకర్యం ఉండదు. ప్రభుత్వ వెబ్‌సైట్లలో వేలాది జీవోలు, ఉత్తర్వులు, సర్క్యులర్లు, నివేదికలు, ఫైళ్లు ఉంటాయి. వాటిలో ఒక సాధారణ వ్యక్తి తనకు అవసరమైన సమాచారాన్ని వెతకడం చాలా కష్టసాధ్యం. కొన్ని లింకులు పనిచేయవు. కొన్ని పత్రాలు అసంపూర్ణంగా ఉంటాయి. మరికొన్ని నవీకరించబడకపోవచ్చు. అలాంటి పరిస్థితుల్లో సమాచార హక్కు చట్టం ద్వారా నిర్దిష్ట సమాచారాన్ని కోరడం పూర్తిగా చట్టబద్ధమైన హక్కు.

ముఖ్యంగా కోర్టు కేసులు, ప్రభుత్వ విచారణలు, ఉద్యోగ నియామకాలు లేదా ఇతర అధికారిక అవసరాల కోసం ధృవీకరించిన ప్రతులు అవసరమవుతాయి. వెబ్‌సైట్‌లో ఉన్న పి డి ఎఫ్ లు చాలాసార్లు అధికారిక ఆధారాలుగా సరిపోవు. అందువల్ల వెబ్‌సైట్ ఎప్పటికీ సమాచార హక్కు చట్టానికి ప్రత్యామ్నాయం కాదు.




సమాచార హక్కు చట్టంలోని సెక్షన్ 6(2) ప్రకారం, సమాచారం కోరే వ్యక్తి తాను ఎందుకు సమాచారం అడుగుతున్నాడో చెప్పాల్సిన అవసరం లేదు. చట్టం పౌరుడి ఉద్దేశాన్ని కాదు, అతని హక్కును గుర్తించింది. అలాంటప్పుడు "సమాచార హక్కు చట్టం ఎందుకు వేశారు?" అనే ప్రశ్న కూడా చట్టం ఆత్మకు అనుగుణంగా ఉండదు. అధికారి బాధ్యత సమాచారం ఇవ్వడం లేదా చట్టంలోని మినహాయింపు వర్తిస్తే దానిని స్పష్టంగా తెలియజేయడం.

దురదృష్టవశాత్తు, కొన్ని సందర్భాల్లో "వెబ్‌సైట్‌లో చూసుకోండి" అనే ఒక్క సమాధానంతో పౌరులను వెనక్కి పంపిస్తున్నారు. ఏ వెబ్‌సైట్? ఏ పేజీ? ఏ లింక్? ఏ ఉత్తర్వు? అనే వివరాలు ఇవ్వకుండా ప్రజలను వెతకమని చెప్పడం ప్రజా సేవ కాదు. ప్రజలకు సహాయం చేయాల్సిన వ్యవస్థ, ప్రజలనే వెతకమని చెప్పడం సరైన పరిపాలన కాదు.

సమాచార హక్కు చట్టంలోని సెక్షన్ 4 ప్రకారం ప్రభుత్వ శాఖలు వీలైనంత ఎక్కువ సమాచారాన్ని స్వయంగా ప్రజలకు అందుబాటులో ఉంచాలి. కానీ నేటి పరిస్థితుల్లో అనేక ప్రభుత్వ వెబ్‌సైట్లలో సాధారణ సమాచారం మాత్రమే కనిపిస్తుంది. పరిపాలనా సమావేశాల్లో తీసుకున్న నిర్ణయాలు, వాటి అమలు స్థితి, ఫైల్ నోటింగ్స్, విధాన నిర్ణయాలకు సంబంధించిన అనేక ముఖ్యమైన రికార్డులు ప్రజలకు సులభంగా అందుబాటులో లేకపోవడం గమనించదగిన విషయం. దీని వల్ల ప్రజల్లో అనుమానాలు పెరుగుతున్నాయి.

ప్రభుత్వ కార్యాలయాల్లో పనిచేసే ప్రతి అధికారి అటు ప్రభుత్వానికీ, ఇటు ప్రజలకూ జవాబుదారీగా ఉండాలి. అయితే కొన్ని సందర్భాల్లో సమాచారం ఇవ్వాల్సిన బాధ్యతను విస్మరించడం, చట్టబద్ధంగా ఇవ్వాల్సిన సమాచారాన్ని మినహాయింపుల పేరుతో నిరాకరించడం, లేదా రికార్డుల నిర్వహణలో నిర్లక్ష్యం కనిపించడం వంటి అంశాలు ప్రజల విశ్వాసాన్ని దెబ్బతీస్తాయి. అందుకే సమాచార హక్కు చట్టం ప్రభుత్వ వ్యవస్థలో పారదర్శకతను, జవాబుదారీతనాన్ని బలోపేతం చేసే అత్యంత ముఖ్యమైన చట్టంగా నిలిచింది.

సమాచార హక్కు చట్టం కేవలం సమాచారం పొందే హక్కు మాత్రమే కాదు; ప్రభుత్వ రికార్డుల పరిరక్షణకు, ప్రజా ఆస్తుల రక్షణకు, అవినీతిని అరికట్టడానికి, అధికార దుర్వినియోగాన్ని ప్రశ్నించడానికి సామాన్యుడి చేతిలో ఉన్న శక్తివంతమైన ప్రజాస్వామ్య ఆయుధం.

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో సమాచార హక్కు చట్టం అమలుకు అవసరమైన పరిపాలనా చర్యలకు అప్పటి ముఖ్యమంత్రి డా. వై.ఎస్. రాజశేఖర రెడ్డి ప్రభుత్వం సహకరించింది. దాంతో లక్షలాది మంది సామాన్యులు తమ హక్కులను వినియోగించుకునే అవకాశం పొందారు. ఈ చట్టం అనేకమందికి రక్షణ కవచంగా నిలిచింది.

సమాచారం ప్రజలది. దానిని పొందే హక్కు కూడా ప్రజలదే. అందుకే ఇకపై ప్రభుత్వ కార్యాలయాల్లో "వెబ్‌సైట్‌లో ఉంది కదా... ఆర్‌టీఐ ఎందుకు?" అనే ప్రశ్నకు బదులుగా, "మీకు కావాల్సిన సమాచారాన్ని చట్టం ప్రకారం అందిస్తాం" అనే సేవాభావం పెరగాలి.

అదే సమాచార హక్కు చట్టం యొక్క అసలు స్ఫూర్తి. అదే పారదర్శక పరిపాలనకు, ప్రజల విశ్వాసానికి, బలమైన ప్రజాస్వామ్యానికి నిజమైన పునాది.






# మా అత్తా చచ్చేలా చూడు దేవుడా




**జనసైన్యం సిటి**

ఓ కోడలు తన అత్తను చచ్చేలా చూడాలని రూ.20 నోటు మీద రాసిన ఫోటో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.అనంతపురం జిల్లాలోని ఓ దేవాలయంలోఘ హుండీ లెక్కింపు సమయంలో వెలుగుచూసిన ఘటన భక్తులను ఆశ్చర్యానికి గురిచేసింది.ఓ మహిళ తన అత్త వేధింపుల నుంచి విముక్తి కల్పించాలంటూ.. దేవుడికి చేసిన వినతి అందరినీ విస్మయానికి గురిచేసింది.ం

# సిద్ధిపేటలో హరీష్ రావును ఓడించడం ఎవరి వల్లా కాద



**జనసైన్యం సిటి**

సిద్ధిపేట ప్రజల ఆరాధ్య నాయకుడు, ఆపద్బాంధవుడు అయిన హరీష్ రావు గారిని ఓడించడం ఎవరి వల్లా సాధ్యం కాదని బీఆర్ఎస్ పార్టీ మాజీ మండల అధ్యక్షులు కాముని శ్రీనివాస్ అన్నారు.శుక్రవారం చిన్న కోడూరు మండలంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాజీ వైస్ ఎంపీపీ కీసరి పాపయ్య, సర్పంచ్‌ల ఫోరం మాజీ మండల అధ్యక్షులు కాముని ఉమేష్ చంద్ర, బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు జంగిటి శ్రీనివాస్ ముదిరాజ్ తదితరులతో కలిసి ఆయన మాట్లాడారు.

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన పదవిపై ఉన్న అనిశ్చితి, భయాందోళనల కారణంగానే సిద్ధిపేటలో హరీష్ రావు గారి ఓటమిపై వ్యాఖ్యలు చేస్తున్నారని విమర్శించారు. హరీష్ రావు గారిపై ప్రజలకు ఉన్న అభిమానానికి కొలమానం లేదని, ఆయన ఓటమి గురించి మాట్లాడటం వాస్తవాలకు దూరమని అన్నారు.రైతుల సమస్యలను పరిష్కరించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని ఆరోపించిన కాముని శ్రీనివాస్, రైతులు పండించిన ధాన్యాన్ని పూర్తిస్థాయిలో కొనుగోలు చేయలేక ప్రభుత్వం చేతులెత్తేసిందన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మాజీ ముఖ్యమంత్రి కే. చంద్రశేఖర్ రావు (కేసీఆర్) రైతులు పండించిన ధాన్యాన్ని పూర్తిగా కొనుగోలు చేసిన విషయాన్ని రైతులు ఇప్పటికీ గుర్తు చేసుకుంటున్నారని పేర్కొన్నారు.కరోనా వంటి క్లిష్ట పరిస్థితుల్లో కూడా రైతులను ఆదుకునేందుకు బీఆర్ఎస్ ప్రభుత్వం చర్యలు తీసుకుందని, ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన బోనస్ హామీలు పూర్తిస్థాయిలో అమలు కావడం లేదని విమర్శించారు.అలాగే,రైతులకు పెండింగ్‌లో ఉన్న రైతుబంధు నిధులను వెంటనే విడుదల చేయాలి.ప్రస్తుత విడత రైతుబంధు సాయాన్ని రైతుల ఖాతాల్లో జమ చేయాలి.రైతు బీమా పథకాన్ని సమర్థంగా అమలు చేయాలి.రాబోయే వానాకాలం పంటల కొనుగోలుపై ప్రభుత్వం స్పష్టమైన హామీ ఇవ్వాలి. యూరియాను యాప్‌ల ద్వారా కాకుండా నేరుగా ఎరువుల దుకాణాల ద్వారా రైతులకు అందుబాటులో ఉంచాలి.అని డిమాండ్ చేశారు.వచ్చే ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెబుతారని, బీఆర్ఎస్ పార్టీ మరింత బలంగా ముందుకు సాగుతుందని ఆయన పేర్కొన్నారు.కార్యక్రమంలో పాల్గొన్నవారు

కాముని శ్రీనివాస్, జంగిటి శ్రీనివాస్ ముదిరాజ్, కీసరి పాపయ్య, కాముని ఉమేష్ చంద్ర, రేగుల దేవయ్య, నముండ్ల హరీష్, మన్నె ఆనంద్, పిట్ల ప్రేమ్, రాజశేఖర్ రెడ్డి, భాను, ఏదుల రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కవిత పై విరుచుకుపడ్డ జనసేన నాయకులు




**జనసైన్యం సిటి**
కరీంనగర్ జిల్లా జనసేన పార్టీ కోఆర్డినేటర్ కందుల రాజిరెడ్డి ఆధ్వర్యంలో ఈరోజు జిల్లా కార్యాలయంలో ప్రెస్ మీట్ నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా రాజిరెడ్డి మాట్లాడుతూ కల్వకుంట్ల కవిత నోరు అదుపులో పెట్టుకోవాలని పవన్ కళ్యాణ్ గారిపై చేసిన వ్యాఖ్యలను వెంటనే వాపకు తీసుకోవాలని జనసేన పార్టీకి వస్తున్న ప్రజాదరణను చూసి ఓర్వలేక అనుక్షణం ప్రతిక్షణం పవన్ కళ్యాణ్ గారు జపం చేస్తున్నారు కల్వకుంట్ల కవిత గారు ఇకనైనా మేలుకొని ప్రజల సమస్యలపై పోరాటం చేస్తే బాగుంటుందని ఇతర పలికారు మరోసారి పవన్ కళ్యాణ్ గారిపై నచ్చితే వాక్యాలు చేస్తే కల్వకుంట్ల కవితతో పాటు టిఆర్ఎస్ పార్టీ నీ బొంద పెడతామని తెలంగాణలో హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పార్టీ నాయకులు కాసరాజు పటేల్, పొన్నాల తిరుపతి, వీళ్ళ శ్రీనివాసరావు. రాజ్ కుమార్, హరీష్, వేణుగోపాల్, మహేష్, కుమార్, గుండా శకుంతల, కుంట సుజాత, పాల్గొన్నారు..

## బీఎస్పీ జాతీయ నేతలను కలిసిన జిల్లా నాయకులు




కుమురం భీమ్ అసిఫాబాద్ :- బహుజన సమాజ్ పార్టీ ఛీఫ్ సెక్టార్ కో ఆర్డినేటర్లు తెలంగాణ ఆంధ్ర ప్రదేశ్ ఇంచార్జ్ లైన మాజీ ఎమ్మెల్సీ అతర్ సింగ్ రావు సురేష్ ఆర్య బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఇబ్రాం శేఖర్ లను ఈ రోజు రాష్ట్ర కార్యాలయంలో జోన్ ఛీఫ్ ఇంచార్జ్ అడ్వకేట్ నిషాని రామచంద్రం ఆద్వర్యం లో అదిలాబాద్ పార్లమెంట్ ఇంచార్జి సాలం బీన్ హసన్ కుమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా అధ్యక్షులు దుర్గం తుకరాం జిల్లా ఉపాధ్యక్షులు ముదస్సీర్ హుస్సేన్ మాజీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మహమ్మద్ సిరాజుద్దీన్ లు మర్యాద పూర్వకంగా కలిసి సాలం బీన్ హసన్ అతర్ సింగ్ రావు కు పుష్పగుచ్ఛం అందించి శాలువా తో సత్కరించగా తుకరాం సురేష్ ఆర్య కి పుష్పగుచ్ఛం అందజేసి శాలువ తో సత్కరించారు. అనంతరం జిల్లాలో పార్లమెంట్ లో పార్టీ స్థితి గతులను అడిగి తెలుసుకున్నారు. ముస్లిం సమాజం యొక్క ఇబ్బందుల పైన వారి రాజకీయ ఉద్దేశ్యం పైన వారి అవసరాల మీద జిల్లా నాయకులను విచారించారు. జిల్లా కమిటీ అసెంబ్లీ కమిటీ లను సెక్టార్ కమిటీలను మరియూ బూత్ కమిటీ లను పూర్తి చేయాలని ఆదేశాలు ఇచ్చారు. ఎస్ ఐ ఆర్ మీద ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. పేద ప్రజల ఓట్లు ముఖ్యంగా బహుజనుల ఓట్లు గల్లంతు కాకుండా చూడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మరోక ఛీఫ్ జోన్ ఇంచార్జ్ దయానంద్ రావ్ రాష్ట్ర కోశాధికారి నాయిని ప్రణయ్ తదితరులు పాల్గొన్నారు.

## జమ్మికుంట ప్రభుత్వ ఆసుపత్రిని వంద పడకల హాస్పిటల్గా అప్ గ్రేడ్ చేయాలి



**జనసైన్యం సిటి**
జమ్మికుంట పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిని వంద పడకల ఆసుపత్రిగా రాష్ట్ర ప్రభుత్వం అప్ గ్రేడ్ చేయాలని జూవీ జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి డిమాండ్ చేశారు. ఈరోజు జమ్మికుంట పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిని సిపిఎం పార్టీ జమ్మికుంట మండల కమిటీ ఆధ్వర్యంలో సందర్శించారు. ఆస్పత్రిలో ఉన్న పేషంట్లతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వాసుదేవరెడ్డి మాట్లాడుతూ జమ్మికుంట చుట్టుపక్కల 300 పైచిలుకు గ్రామాలకు కూడలిగా ఉన్న ఆసుపత్రిని వంద పడకల ఆసుపత్రిగా అప్ గ్రేడ్ చేసి అందుకు తగిన డాక్టర్లను,సిబ్బందిని వైద్య పరికరాలను సమకూర్చాలని డిమాండ్ చేశారు. దశాబ్దాల కాలం నుండి 30 పడకల ఆసుపత్రికె పరిమితం చేశారని రెండు నెలల క్రితం 50 పడకల ఆసుపత్రిగా అప్గ్రేడ్ చేస్తున్నట్టు ప్రకటించినప్పటికీ ఆచరణలో అడుగు ముందుకు పడలేదన్నారు. చిన్న చిన్న ప్రమాదాలు జరిగిన ఎక్స్ రే సౌకర్యం లేకపోవడం వలన సుదూర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తుందని దీనితో పేషంట్లకు ఆర్థిక ,భారం పడుతుందన్నారు. స్కానింగ్ సెంటర్ లేకపోవడం వలన స్థానిక ప్రైవేట్ స్కానింగ్ సెంటర్ నిర్వాహకులు పేషంట్ల నుండి పెద్ద ఎత్తున దోపిడీ చేస్తున్నారని విమర్శించారు. పేషెంట్లకు అన్ని రకాల టెస్టులు చేయాలని అన్నారు. డయాలసిస్ సెంటర్ ప్రకటించి సంవత్సరం అవుతున్న ఇప్పటివరకు అమలు కావడం లేదని దీనివలన డయాలసిస్ పేషెంట్లు హనుమకొండ కరీంనగర్ ప్రాంతాలకు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని, రాష్ట్ర ప్రభుత్వం హడావిడిగా పేపర్ ప్రకటనలకే డయాలసిస్ కేంద్రం మంజూర అయిందని ప్రకటిస్తున్నారని ఆచరణలో మాత్రం అమలు కావడం లేదన్నారు. ఔట్సోర్సింగ్ కార్మికులందర్నీ వెంటనే పర్మినెంట్ చేయాలని కనీస వేతనం నెలకు 26 వేల రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. హాస్పటల్లో రోగులకు సరిపడా డాక్టర్స్ లేకపోవడం వల్ల రోగులు ఇబ్బంది పడుతున్నారని, వెంటనే ఖాళీగా ఉన్న డాక్టర్ పోస్టులను మరియు స్టాప్ నర్స్ తో పాటు సిబ్బందిని నియమించాలని డిమాండ్ చేశారు. డాక్టర్లు మరియు వైద్య సిబ్బంది దూర ప్రాంతాల నుండి కాకుండా జమ్మికుంట లోనే నివాసం ఉండే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమయపాలన పాటించని నాణజ,ఖణజ, సీనియర్ అసిస్టెంట్ ఫార్మసిస్టులపై శాఖపరమైన చర్యలు తీసుకోవాలన్నారు.సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు. ఈ సందర్శన కార్యక్రమంలో పార్టీ మండల కమిటీ సభ్యులు వడ్లూరి కిషోర్, జక్కుల రమేష్ యాదవ్, దండిగారి సతీష్, కన్నం సదానందం, రావుల ఓదెలు, జీడి సదానందం తదితరులు పాల్గొన్నారు.

## దేశాన్ని అప్పుల ఊబిలోకి నెట్టి,ప్రజలపై భారం వేస్తున్న మోడీ ప్రభుత్వం.




భారత దేశాన్ని అప్పుల ఊబిలోకి నెట్టివేయడానికి ప్రధాని నరేంద్ర మోడీ కారణమని,అప్పుల భారాన్ని,ధరల భారాన్ని మోడీ ప్రజలపై వేస్తున్నాడని సిపిఐ సీనియర్ నాయకులు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి ఆరోపించారు.

శుక్రవారం చిగురుమామిడి మండల కేంద్రంలోని ముస్కు రాజిరెడ్డి స్మారక భవన్ లో సిపిఐ మండల కౌన్సిల్ సేప్స్ సమావేశం తమ్మిశెట్టి రవీందర్ అధ్యక్షతన జరిగింది. అనంతరం జరిగిన విలేకరుల సమావేశంలో చాడ వెంకటరెడ్డి మాట్లాడుతూ ...కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం సామాన్య ప్రజలపై రోజు రోజుకు పెనుభారం మోపుతుందని,కేంద్రంలో బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చేనాటికి దేశానికి 55 లక్షల కోట్లకు పైగా అప్పులు ఉంటే 12 సంవత్సరాలలో దానికి నాలుగింతలు పెరిగి దాదాపుగా 214 లక్షల కోట్లకు పైగా అప్పులు చేసిన మోడీ ప్రభుత్వం ప్రజలపై అడ్డగోలుగా పన్నుల భారం వేస్తుందని,రాష్ట్రంలోని బీజేపీ ఎంపీలు ధరల పెరుగుదలను చూస్తూ ఉన్నారే తప్పా చేసిందేమీ లేదని, డబుల్ ఇంజన్ సర్కార్ వస్తాదని కళలు కంటున్న బీజేపీ 12 ఏళ్లలో వంట గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరలు డబుల్ చేసిందని,ఇంకా పేరుగుతాయని సంకేతాలు ఇవ్వడం సిగ్గుచేటని,మరోవైపు నిత్యావసర వస్తువుల ధరలు కూడా పెంచిందని,75రూపాయలు ఉన్న కిలో నూనె నేడు 165 రూపాయలు పెరిగిందని,కంది,పెసర,శనిగ పప్పులు,నిత్యం వంటకు ఉపయోగపడే ప్రతీ వస్తువు ధర పెంచడంతో పేదల కొనుగోలు శక్తి పడిపోయిందని అన్నారు.దేశ సంపదను అదానీ,అంబానీ లకు దోచిపెడుతుందని,పెట్టుబడి దారులకు కోట్ల రూపాయల బకాయిలు మాఫీ చేస్తూ అనేక రాయితీలు ఇస్తుందని,దేశానికి అన్నం పెట్టే రైతులకు మాత్రం రుణాలు,రాయితీలు ఇవ్వడంలేదన్నారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని నీరుగారి చెందిన పూనుకోవద్దు అని, కూలీల పొట్టలు కొడుతుందని,60 శాతం కేంద్రం 40% రాష్ట్రాలు ఆ పథకానికి నిధులు ఇవ్వాలని చెప్పడం దారుణమని,రాష్ట్రాల వాటా ధనాన్ని పెంచి రాష్ట్రాలపై భారం వేస్తుందని,హక్కులను హరిస్తుందన్నారు.

రాష్ట్ర ప్రభుత్వం రైతుల వద్ద కొనుగోలు చేసిన ధాన్యానికి డబ్బులు వెంటనే చెల్లించాలని వెంకటరెడ్డి కోరారు. మండలంలో పార్టీ,ప్రజా సంఘాల నిర్మాణాన్ని బలోపేతం చేయడం కోసం శ్రేణులు పనిచేయాలని,సమస్యలపై ఉద్యమాలు నిర్వహించాలని చాడ వెంకటరెడ్డి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు అందె స్వామి,మండల కార్యదర్శి నాగెల్లి లక్ష్మారెడ్డి,జిల్లా కౌన్సిల్ సభ్యులు అందె చిన్న స్వామి,బూడిద సదాశివ,మావురపు రాజు,తేరాల సత్యనారాయణ,ముల్కనూర్ ఉప సర్పంచ్ పైడిపల్లి వెంకటేష్,వార్డు సభ్యురాలు రాకం అంజవ్వ ,మహిళా సమాఖ్య నాయకురాలు కయ్యం సుజాత,వివిధ గ్రామాల శాఖ కార్యదర్శులు,కౌన్సిల్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా రాహుల్ గాంధీ జన్మదినోత్సవ వేడుకలు




కరీంనగర్ కార్పొరేషన్ కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో నగరంలోని ఇందిరా చౌక్ లో ఏర్పాటు చేసిన రాహుల్ గాంధీ గారి జన్మదినోత్సవ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన చొప్పదండి శాసనసభ్యులు,జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు మేడిపల్లి సత్యం గారు, రాష్ట్ర మున్నూరు కాపు కార్పొరేషన్ చైర్మన్ బొమ్మ శ్రీరామ్ చక్రవర్తి, కరీంనగర్ కార్పొరేషన్ అధ్యక్షులు వైద్యుల అంజన్ కుమార్, ఆర్టిప మెంబర్ పడాల రాహుల్ గౌడ్, అర్బన్ బ్యాంక్ చైర్మన్ కర్ర రాజశేఖర్, గార్లతో కలిసి కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు.

ఈ సందర్భంగా మేడిపల్లి సత్యం గారు మాట్లాడుతూ.. యువ నాయకులు,లోక్ సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ గారి జన్మదినోత్సవ వేడుకలను కరీంనగర్ నగరంలో ఘనంగా నిర్వహించుకోవడం జరిగిందని, దేశ రాజకీయాల్లో రాహుల్ గాంధీ గారు 2004 నుండి ప్రస్తుతం పార్లమెంటు సభ్యుడిగా యూపీఏ హయాంలో 2004 నుండి 2014 వరకు అనేక చట్టాల రూపకల్పనలో, సంక్షేమ పథకాల రూపకల్పనలో రాహుల్ గాంధీ సలహాలు సూచనలు ఈ దేశానికి ఎంతగానో ఉపయోగపడ్డాయని, ఇన్ఫర్మేషన్ యాక్ట్ గాని, అదేవిధంగా ఉపాధి హామీ పథకం, రైతు ఎడ్యుకేషన్ లాంటి విప్లవాత్మక చట్టాల రూపకల్పనలో రాహుల్ గాంధీ సహకారం ఎంతో ఉంది అని, ప్రధానమంత్రి నరేంద్ర మోడీ గారి నియంతృత్వ పాలనకు నిరసనగా ఈ దేశ ప్రజలందరినీ ఐక్యమత్యం చేయాలని, దేశంలో ప్రజలందరూ కుల,మతాలకు అతీతంగా ఐక్య మత్యంగా ఉండాలని, కన్యాకుమారి నుండి కాశ్మీర్ వరకు సుమారు నాలుగు వేల కిలోమీటర్లకు పైగా పాదయాత్ర చేశారని, దేశ ప్రజలతో మమేకమైనటువంటి రాహుల్ గాంధీ గారికి భగవంతుడు ఆయురారోగ్యాలు ప్రసాదించాలని కోరుకుంటూ, భవిష్యత్తులో దేశానికి ప్రధానమంత్రి కావాలని, ఉన్నత విద్యావంతుడు,సమాజం పట్ల అవగాహన ఉన్న నాయకుడు, ఈ దేశానికి ప్రధానమంత్రి అయితే అందరూ సంతోషిస్తారని, 2029 ఎన్నికల్లో రాహుల్ గాంధీ గారిని ప్రధానమంత్రి చేయాలనే లక్ష్యంతో ప్రతి కాంగ్రెస్ కార్యకర్త సైనికుడి వలె కంకణ బద్ధులై పని చేయాలని పిలుపునిచ్చారు.

వైద్యుల అంజన్ కుమార్ మాట్లాడుతూ.. కాబోయే బావి భారత ప్రధాని యువ నాయకులు, లోకసభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ జన్మదినోత్సవాన్ని కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి మేడిపల్లి సత్యం గారు ముఖ్య అతిథులుగా హాజరై కేకు కట్ చేసి సంబరాలు జరుపుకోవడం జరిగింది. రాబోయే రోజుల్లో రాహుల్ గాంధీ గారిని ప్రధానమంత్రి చేయడానికి కాంగ్రెస్ నాయకులు కంకణ బద్ధులై ముందుకు సాగాలని, భగవంతుడు ఆయురారోగ్యాలు ప్రసాదించాలని కోరుకుంటున్నానని, రాహుల్ గాంధీ గారికి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేస్తున్నాను.

ఆరేపల్లి మోహన్ మాట్లాడుతూ.. రాబోయే కాలంలో ప్రధాని అయ్యే రాహుల్ గాంధీ ప్రజల ఆకాంక్ష మేరకు పనిచేసే నాయకుడిగా గుర్తింపు పొందిన వారికి కరీంనగర్ జిల్లా పక్షాన జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తున్నామని అన్నారు.

అనంతరం సివిల్ హాస్పిటల్ చౌరస్తాలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ అర్షమల్లేశం రాజీవ్ గాంధీ బర్త్ డే కేకును కట్ చేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో నాయకులు మడుపు మోహన్, పులి ఆంజనేయులు, గౌడ్,కోమటిరెడ్డి పద్మాకర్ రెడ్డి, ముత్యం శంకర్ గౌడ్, వెన్నం రజిత రెడ్డి,గడ్డం విలాస్ రెడ్డి, ఆకారపు భాస్కర్ రెడ్డి, ఇప్ప శ్రీనివాస్ రెడ్డి, వరాల నర్సింగం, బొబ్బిలి విక్టర్, కామ్రెడ్డి రాంరెడ్డి, నిహాల్, వెన్న రాజ మల్లయ్య,కుంభాల రాజకుమార్, కొమ్మెర బోయిన సువీన్ యాదవ్, ఇమ్రాన్, దన్ను సింగ్, వసీం, షబానా మహమ్మద్, గడప శ్రీనివాస్, కోడూరు రవీందర్ గౌడ్, ఆకుల ఉదయ్, ముంద మహేష్, మాజీద్ అలీ ఖాన్, మాలోతు మహాలక్ష్మి, దిండిగాల మధు, వేల్పుల వెంకటేష్, అహమ్మద్ అలీ, కపిల్ మాధవ్, మాదాసు శ్రీనివాస్, ఇమ్రాన్ ఘని , పెంట శేఖర్, కాసెట్టి శ్రీనివాస్, ములకల కవిత, హస్తపురం తిరుమల, సుంకరి గణపతి, మన్నె జ్యోతి రెడ్డి, సమీ, కంకణాల అనిల్ కుమార్ గుప్తా, అమీర్, హనీఫ్, స్వప్న శ్రీ, బత్తిని చంద్రయ్య గౌడ్, మూల జయపాల్, సత్తినేని శ్రీకాంత్, మూల కృష్ణారెడ్డి, రూపు రెడ్డి శ్రీనివాస్ రెడ్డి, బండి శరణ్య, హైమద్, ముక్క భాస్కర్, గున్నాల రమేష్, కలీం మొద్దిన్, బషీరుద్దీన్, రంగా నాయక్, రాచర్ల పద్మ, సింగిరెడ్డి రామిరెడ్డి, ఫారూఖ్, గండి గణేష్, అక్బర్ తదితరులు పాల్గొన్నారు.

# కరీంనగర్ జిల్లాలో ప్రజా పాలన జయకేతనం



99 రోజులపాటు రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక కార్యక్రమం కరీంనగర్ జిల్లాలో చారిత్రాత్మకంగా నిలిచింది. ప్రజల జీవితాల్లో పెను మార్పులను తీసుకొచ్చింది. గ్రామ గ్రామాన వార్డు మెంబర్ నుంచి మంత్రుల వరకు.. మరోపక్క పంచాయతీ కార్యదర్శి నుంచి జిల్లా కలెక్టర్ వరకు.. అందర్నీ భాగస్వామ్యం చేసింది ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక. ఇంతకు మునుపెన్నడూ జరగని విధంగా ఈ కార్యక్రమం 99 రోజులపాటు నిరాటకంగా జరగడం విశేషం. అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు మరింత చేరువ అయ్యేలా చేసింది. జిల్లా ఇన్చార్జి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ,మంత్రులు పొన్నం ప్రభాకర్, శ్రీధర్ బాబు, అడ్లూరి లక్ష్మణ్ కుమార్ నేతృత్వంలో జిల్లా కలెక్టర్ పర్యవేక్షణలో కరీంనగర్ జిల్లాలో విజయవంతంగా ఈ కార్యక్రమం ముగిసింది. 10 ప్రధాన అంశాలపై షెడ్యూల్ వారీగా నిర్వహించి పాలన ప్రజలకు మరింత చేరువైంది. కరీంనగర్ జిల్లాలో మార్చి 6 నుంచి జూన్ 12, 2026 వరకు అమలైన ఈ కార్యక్రమం గ్రామ, మండల, నియోజకవర్గ, జిల్లా స్థాయిల్లో అద్భుతంగా జరిగింది.

తద్వారా కరీంనగర్ జిల్లా ప్రగతి ప్రధాన నిలిచేందుకు దోహదపడింది. కరీంనగర్, మానకొండూరు, చొప్పదండి, హుజురాబాద్ నియోజకవర్గాల్లో అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను ప్రజల ముందు ఉంచింది. కరీంనగర్ జిల్లా ఆదర్శంగా నిలిచింది. మంత్రుల ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ పర్యవేక్షణలో అన్ని శాఖల అధికారుల సమన్వయంతో ప్రజల సహకారంతో ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక దిగ్విజయంగా పూర్తయింది. చొప్పదండి శాసనసభ్యులు మేడిపల్లి సత్యం, మానకొండూర్ శాసనసభ్యులు కవ్వంపల్లి సత్యనారాయణ, మేయర్ కొలగాని శ్రీనివాస్, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, జిల్లా గ్రంధాలయ సంస్థ చైర్మన్ సత్తు మల్లేశం, పలువురు ప్రజా ప్రతినిధులు ప్రజా పాలన కార్యక్రమం నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ వహించారు.

### మంత్రుల సమక్షంలో ఘనంగా ప్రారంభమైన కార్యక్రమం

ప్రజాపాలన – ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణకు 2026 మార్చి 6న కరీంనగర్ కలెక్టరేట్ ఆడిటోరియంలో శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఉమ్మడి కరీంనగర్ జిల్లా సమన్వయ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి వ్యవసాయ శాఖ మంత్రి, జిల్లా ఇన్చార్జి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రవాణా బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రభుత్వ విప్ లు ఆది శ్రీనివాస్ , చింతకుంట విజయ రమణారావు ఎంపీలు ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు , ఉమ్మడి జిల్లా కలెక్టర్లు, ఎస్పీలు, పలువురు అధికారులు హాజరయ్యారు.



### పరిశుభ్రత.. ఫైళ్ల పరిష్కారంలో ప్రధాన పాత్ర.

ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో మొట్టమొదటి అంశం ఫైళ్ళ పరిష్కారం పరిశుభ్రత కార్యక్రమం. జిల్లాలోని 318 గ్రామపంచాయతీలు కరీంనగర్ కార్పొరేషన్ తో పాటు హుజురాబాద్ జమ్మికుంట చొప్పదండి మున్సిపాలిటీల్లో పెద్ద ఎత్తున పరిశుభ్రత కార్యక్రమాలు నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలలో పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాలు, మార్కెట్లు, హాస్టళ్లు, శ్మశానవాటికలు, బస్టాండ్లలో పరిశుభ్రత కార్యక్రమాలు చేపట్టారు. పరిశుభ్రతకు నోచుకోని ఆయా కేంద్రాలు ప్రస్తుతం శోభాయమానంగా తయారయ్యాయి. ప్రభుత్వం చేపట్టిన పరిశుభ్రత కార్యక్రమం మంచి ఫలితాలను ఇచ్చింది.

ప్రభుత్వ కార్యాలయాల్లో పాత సామగ్రిని తొలగించి పరిశుభ్రత చర్యలు చేపట్టారు. అదేవిధంగా ఫైళ్ల పరిష్కారానికి ప్రధానంగా కృషి చేశారు. జనన--మరణ ధ్రువపత్రాలు, వ్యాపార లైసెన్సులు, మ్యుటేషన్లు, లేఅవుట్ అనుమతులు, ఈ–ఆఫీస్ ఫైళ్లతో కలిపి మొత్తం 4,290 ఫైళ్లను జిల్లాలో పరిష్కరించారు. భూభారతి కింద అందిన 239 దరఖాస్తులను పరిష్కారానికి అధికారులు ఉన్నతాధికారులకు పంపించారు. ఇంటి వద్దే చెత్త వర్గీకరణ, హోం కంపోస్టింగ్, ప్లాస్టిక్ నిషేధం, ఈ–వేస్ట్ సేకరణ, ఫాగింగ్, బ్లీచింగ్, డ్రైనేజీల పూడికతీత కార్యక్రమాలు చేపట్టారు.

### అరైవ్ అలైవ్ రాష్ట్ర వ్యాప్తంగా గుర్తింపు..

### రోడ్డు ప్రమాదాల నియంత్రణలో ముందడుగు..

ఏప్రిల్ 13 నుంచి 18 వరకు జిల్లాలో రోడ్డు ప్రమాదాల నియంత్రణకు పోలీస్ శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన అరైవ్ అలైవ్ కార్యక్రమం సత్ఫలితాలను ఇచ్చింది. రోడ్డు ప్రమాదాల నియంత్రణకు ముందడుగు పడింది. రోడ్డు ప్రమాదాల నియంత్రణకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని పిలుపునిచ్చారు. పోలీస్ శాఖ ఆధ్వర్యంలో వినూత్నమైన కార్యక్రమాలు నిర్వహించి ప్రజల్లో నూతన మార్పు తీసుకొచ్చారు. 318 గ్రామపంచాయతీల్లో రోడ్డు భద్రత గ్రామసభలు నిర్వహించి 2,986 మంది సభ్యులతో కమిటీలు ఏర్పాటు చేశారు. హెల్మెట్, సీటుబెల్ట్ వినియోగం, ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. 19 ప్రాంతాల్లో గోల్డెన్ అవర్ స్పందన శిక్షణ, రాహవీర్, పీఎం రాహత్ పథకాలపై కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమం ద్వారా రోడ్డు ప్రమాదాలు, మరణాలు సంఖ్య గణనీయంగా తగ్గింది. జీరో ఎన్ఫోర్స్మెంట్ డే సందర్భంగా హెల్మెట్ ధరించిన వాహనదారులను పూలతో అభినందించారు. అత్యధికంగా జిల్లాలో రోడ్డు ప్రమాదాలు జరిగే బ్లాక్ స్పాట్లుగా గుర్తించి వాటి నియంత్రణకు ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టారు. ప్రజలు ప్రయాణికుల నుంచి మంచి స్పందన లభించింది. సైబర్ నేరాలు, ఆన్లైన్ మోసాలు, పిల్లల భద్రతపై ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. అనాథ, విడిచిపెట్టబడిన పిల్లలపై సర్వే చేపట్టారు. నాలుగు నియోజకవర్గాల్లో డ్రగ్స్ వ్యతిరేక అవగాహన సమావేశాలు నిర్వహించారు.

### అన్నదాతకు అండగా..

ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో రైతు వారోత్సవాల్లో భాగంగా అన్నదాతకు అండగా నిలిచారు. రైతుల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యం ఇచ్చారు. తెలంగాణ ఆర్గానిక్స్ మొబైల్ యాప్ను ప్రారంభించారు. 76 రైతు వేదికల్లో నేల ఆరోగ్యం, సమతుల్య ఎరువుల వినియోగం, సహజ వ్యవసాయం, వినియోగదారులు ఇష్టపడే వరి రకాలపై అవగాహన కల్పించారు. వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ప్రత్యామ్నాయ పంటల సాగు చేపట్టాలని రైతులను ప్రోత్సహించారు. అదేవిధంగా ఫామ్ ఆయిల్ పంటను అత్యధికంగా పండించాలని అధికారులు గ్రామ గ్రామానా విస్తృత ప్రచారం నిర్వహించారు. హార్టికల్చర్, మార్కెటింగ్, పశుసంవర్ధక, నీటిపారుదల శాఖలు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించాయి. "ఖేతీ బచావో అభియాన్" ద్వారా జీవ ఎరువుల వినియోగాన్ని ప్రోత్సహించారు.

### రైతు భరోసా పథకం ద్వారా

1,93, 544 మంది రైతులకు 143.55 కోట్లు నేరుగా రైతుల ఖాతాల్లో ప్రభుత్వం జమ చేసింది. మరణించిన 206 మంది రైతు కుటుంబాలకు రైతు బీమా ద్వారా ప్రభుత్వం ఇప్పటివరకు 13.35 కోట్లు ఆర్థిక సహాయం అందించింది. అదేవిధంగా ఈ సీజన్లో 319 కొనుగోలు కేంద్రాల ద్వారా దాదాపు మూడు లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసి రాష్ట్రంలోనే కరీంనగర్ జిల్లా ఆదర్శంగా నిలిచింది. తద్వారా 554 కోట్లు రైతులకు ప్రభుత్వం అందించింది. అదేవిధంగా 23,710 మెట్రిక్ టన్నుల మొక్కజొన్నను కొనుగోలు చేశారు.

### సంక్షేమ పథకాల అమలులో ఆదర్శం..

### లక్షలాది కుటుంబాలకు అపన్న హస్తం.

సంక్షేమ పథకాల అమల్లో కరీంనగర్ జిల్లా ఆదర్శంగా నిలిచింది. లక్షలాది కుటుంబాలకు అపన్న హస్తం అందిస్తోంది. జిల్లాలో కొత్తగా 45,920 రేషన్ కార్డులు మంజూరు చేసి వేలాది కుటుంబాలకు ఆహార భద్రత కల్పించారు. రేషన్ కార్డులో 96,775 కొత్త సభ్యుల పేర్లను చేర్చారు. 3.20 లక్షల కుటుంబాలకు ప్రతినెల 6,021 మెట్రిక్ టన్నుల సన్న బియ్యం పంపిణీ చేస్తున్నారు.

అదేవిధంగా మహిళల ఆర్థిక సాధికారత కోసం అమలు చేస్తున్న మహాలక్ష్మి పథకం కింద ఆర్టీసీ బస్సుల్లో మహిళలు చేసిన 7.39 కోట్ల ఉచిత ప్రయాణాలకు గాను రూ. 334 కోట్ల లబ్ధి చేకూరింది. జిల్లాలో 1.58 లక్షల మంది లబ్ధిదారులకు 9.23 లక్షల గ్యాస్ సిలిండర్లను రూ.500 రూపాయలకే అందిస్తున్నారు. అందుకోసం ప్రభుత్వం 29.78 కోట్ల వెచ్చిస్తున్నది. అదేవిధంగా గృహ జ్యోతి పథకం ద్వారా జిల్లాలో 1.73,627 మంది వినియోగదా రులకు రూ.153 కోట్ల లబ్ది చేకూరింది. ఇందిరమ్మ పథకం కింద జిల్లాలో 10,114 మంది లబ్ధిదారులను ఎంపిక చేశారు. 7000 కి పైగా ఇండ్లు నిర్మాణ దశలో ఉన్నాయి. 2100 కుటుంబాలు గృహప్రవేశం పూర్తి చేసుకున్నాయి. 100% ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం పై జిల్లా యంత్రాంగం ప్రత్యేక దృష్టి సారించింది. వేగవంతంగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటుంది.

### వైద్యా ఆరోగ్య రంగానికి పెద్ద పీట

వైద్యం ఆరోగ్య పరిరక్షణకు పెద్దపీటవేశారు.ఆహార భద్రత, సురక్షిత మాతృత్వం, ఎయిడ్స్ నివారణ, ఆయుష్, హోమియోపతి సేవలపై వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. జిల్లాలో వివిధ ప్రాంతాలతో పాటు కరీంనగర్ ప్రభుత్వ ప్రధాన ఆస్పత్రిలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి ఆధ్వర్యంలో విస్తృతమైన కార్యక్రమాలు చేపట్టారు. ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహించారు. నాణ్యమైన ఔషధాల లభ్యత, నియంత్రణ వ్యవస్థ బలోపేతానికి చర్యలు చేపట్టారు. ప్రజలకు మరింత మెరుగైన వైద్య సదుపాయం అందేలా జిల్లా యంత్రాంగం తరఫున ప్రత్యేక కృషి చేశారు. కార్పొరేట్ ఆసుపత్రులకు దీటుగా ప్రభుత్వ ఆసుపత్రులను తీర్చిదిద్దడంలో కరీంనగర్ జిల్లా ప్రముఖ పాత్ర పోషిస్తున్నది.

### సంక్షేమ విద్యా సంస్థలకు... కొత్త రూపు

అన్ని సంక్షేమ విద్యాసంస్థల్లో ప్రత్యేక కార్యక్రమాల ద్వారా కొత్త రూపు తీసుకొచ్చారు. అన్ని సంక్షేమ విద్యాసంస్థల్లో పరిశుభ్రత కార్యక్రమాలు నిర్వహించి ఆహార భద్రత కమిటీలను ఏర్పాటు చేశారు. 1,220 మంది విద్యార్థులతో ప్రతిభా ఉత్సవాలు నిర్వహించారు. విద్య, ఆరోగ్యం, పోషణ, క్రమశిక్షణ, కెరీర్ మార్గదర్శకతపై తల్లిదండ్రుల సమావేశాలు నిర్వహించారు. సంక్షేమ విద్యాసంస్థలకు కొత్త రూపు తీసుకొచ్చి మొత్తంగా తీర్చిదిద్దారు. ప్రభుత్వం నాణ్యమైన విద్య బోధన అందిస్తున్నది. అదేవిధంగా ప్రభుత్వం రుచికర భోజనం సన్నబియ్యంతో అందిస్తున్నది. ప్రభుత్వ పాఠశాలల్లో హాజరు శాతం పెంచేందుకు జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టారు. గణనీయ మార్పును తీసుకొచ్చారు. బడిబాట కార్యక్రమం ద్వారా 2026--27 విద్యా సంవత్సరానికి 5,102 ప్రవేశాల లక్ష్యంతో ప్రత్యేక చర్యలు చేపట్టారు.11 భవిత కేంద్రాలు, ఐదు వంటశాల భవనాలు, ఒక సైన్స్ ల్యాబ్ను ప్రారంభించారు. 17 పీఎం శ్రీ పాఠశాలల్లో సమ్మర్ క్యాంపులు నిర్వహించారు. జేఈఈ, నీట్, క్లాట్ కోచింగ్ కార్యక్రమాలు చేపట్టారు. తల్లిదండ్రుల సమావేశాలు, లైబ్రరీ డే, కళలు--సంస్కృతి దినోత్సవం, విద్యా విజయోత్సవం నిర్వహించారు. మొత్తానికి విద్య శాఖ బలోపేతానికి జిల్లా యంత్రాంగం విద్యాశాఖ సమన్వయంతో ప్రత్యేక చర్యలు చేపట్టింది.



### నిరుద్యోగులకు ఉపాధి కల్పన లక్ష్యంగా ముందుకు..

జిల్లాలో పెద్ద ఎత్తున నిరుద్యోగులకు వివిధ ప్రైవేటు కంపెనీల్లో ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించేందుకు జిల్లా యంత్రాంగం ప్రత్యేక చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా జిల్లా కేంద్రం కలెక్టరేట్లో మెగా జాబ్ మేళా నిర్వహించారు. నిరుద్యోగ యువతీ యువకుల నుంచి విశేష స్పందన లభించింది. నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడంలో ఈ జాబ్ మేళా దిక్సూచిగా పనిచేసింది. ఈ మేళాలో 78 వివిధ ప్రైవేట్ కంపెనీలు పాల్గొనగా, దాదాపు 300 మందికి ఉద్యోగ అవకాశాలు లభించాయి. కరీంనగర్ జిల్లాలో హుజురాబాద్ చొప్పదండి ఇతర చోట్ల ప్రతి మూడు నెలలకు ఒకసారి మెగా జాబ్ మేళా లు నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో ప్రణాళిక రూపొందిస్తున్నారు.



### రాష్ట్రానికే దిక్సూచి.. కరీంనగర్ జిల్లా

99 రోజుల కార్యక్రమం ప్రజల ఆకాంక్షలను ఫలితాలుగా మలిచిన సమగ్ర అభివృద్ధి యజ్ఞం. ప్రభుత్వ దృఢ సంకల్పం, జిల్లా యంత్రాంగం సమర్థ నిర్వహణ, ప్రజాప్రతినిధుల చొరవ, ప్రజల చురుకైన భాగస్వామ్యం కలిసొచ్చినప్పుడు మార్పు ఎంత వేగంగా సాధ్యమవుతుందో కరీంనగర్ జిల్లా ఆచరణలో చాటిచెప్పింది. రైతుకు అండగా, మహిళకు ఆత్మవిశ్వాసంగా, యువతకు అవకాశాల వేదికగా, విద్యార్థులకు ఆశల పునాదిగా, గ్రామాలకు పరిశుభ్రతగా, సమాజానికి చైతన్య స్ఫూర్తిగా ఈ ప్రణాళిక ప్రతి రంగంలో స్పష్టమైన ప్రభావాన్ని చూపించింది.

పాలన కార్యాలయాల గోడలకే పరిమితం కాకుండా ప్రజల గడపకు చేరినప్పుడు, సంక్షేమ పథకాలు కేవలం గణాంకాలుగా కాకుండా కుటుంబాల జీవితాల్లో వెలుగులు నింపినప్పుడు, అభివృద్ధి కార్యక్రమాలు ప్రచారంగా కాకుండా ప్రజల అనుభవాలుగా మారినప్పుడు కలిగే సానుకూల మార్పులకు ఈ 99 రోజుల ప్రగతి ప్రణాళిక ప్రత్యక్ష నిదర్శనంగా నిలిచింది.

కాలవ్యవధి 99 రోజులే అయినప్పటికీ... ఈ ప్రగతి ప్రస్థానం ప్రభావం మాత్రం దీర్ఘకాలం నిలిచేలా ఉంది. ప్రజల భాగస్వామ్యంతో పాలనను మరింత చేరువ చేసిన కరీంనగర్ జిల్లా, సమగ్ర అభివృద్ధికి కొత్త ప్రమాణాలను నెలకొల్పుతూ తెలంగాణకు ఆదర్శంగా అవతరించింది. అందుకే ఈ 99 రోజుల ప్రగతి కేవలం ఒక కార్యక్రమం విజయకేతనం కాదు; ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకున్న పాలనకు ప్రతీకగా, కరీంనగర్ జిల్లాకు దక్కిన సరికొత్త గుర్తింపుగా చరిత్రలో నిలిచిపోనుంది.





## యూరియా కొరత, బ్లాక్ మార్కెటింగ్ ఆరోపణలు అవాస్తవం



**జనసైన్యం సిటి**

అక్కన్నపేట మండలంలో యూరియా కొరత, బ్లాక్ మార్కెటింగ్ జరుగుతోందంటూ వచ్చిన వార్తలు వాస్తవ పరిస్థితులకు విరుద్ధమని మండల వ్యవసాయ అధికారి తస్లీమా సుల్తానా స్పష్టం చేశారు. ఈ మేరకు గ్రోమోర్ ఎరువుల విక్రయ కేంద్రాన్ని స్వయంగా తనిఖీ చేసి యూరియా నిల్వలు, విక్రయ విధానం, రైతులకు సరఫరా ప్రక్రియను పరిశీలించినట్లు తెలిపారు.

తనిఖీ సమయంలో ఎటువంటి అవకతవకలు గుర్తించబడలేదని, విక్రయ కేంద్రంలో 1100 యూరియా బస్తాలు యూరియా యాప్‌లో నమోదు చేయబడి రైతులకు పారదర్శకంగా విక్రయించబడుతున్నాయని వెల్లడించారు. రైతులు యాప్ ద్వారా ముందస్తు బుకింగ్ చేసుకుని కేంద్రానికి వచ్చి యూరియాను కొనుగోలు చేస్తున్నారని చెప్పారు. ఒకేసారి 10 నుంచి 15 మంది రైతులు రావడంతో క్యూ ఏర్పడిందని, దీనిని యూరియా కొరతగా భావించడం సరైంది కాదని వివరించారు. ఆన్‌లైన్ విధానంలో యూరియా విక్రయం జరుగుతున్నందున బుకింగ్ ఐడీ ధృవీకరణ, ఆధార్ నమోదు, వేలిముద్ర లేదా ఓటిపి నిర్ధారణ, విక్రయ రిజిస్టర్ నమోదు, బిల్లు జారీ వంటి ప్రక్రియలకు ఒక్కో రైతుకు 3 నుంచి 5 నిమిషాల సమయం పడుతుందని తెలిపారు. ఎరువుల డీలర్లు యూరియా లేదా ఇతర ఎరువులను లింక్ చేసి విక్రయించరాదని, రైతులను ఇతర ఉత్పత్తులు కొనుగోలు చేయాలని బలవంతం చేయరాదని, అలాగే ప్రభుత్వం నిర్ణయించిన గరిష్ట చిల్లర ధర కంటే అధిక ధరలకు విక్రయించరాదని స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినట్లు చెప్పారు. ఈ నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గ్రోమోర్ విక్రయ కేంద్రంలో యూరియా ప్రభుత్వ నిర్ణయించిన ధరలకే విక్రయించబడుతోందని, రైతుల నుంచి ఎలాంటి అదనపు మొత్తాలు వసూలు చేయలేదని, ఇతర ఉత్పత్తులతో లింకేజ్ విక్రయాలు కూడా అమలు చేయడం లేదని తనిఖీలో నిర్ధారణ అయినట్లు తెలిపారు. ప్రస్తుతం మండలంలో యూరియా పంపిణీ సజావుగా కొనసాగుతోందని, యూరియా యాప్ ద్వారా అర్హులైన రైతులకు పారదర్శకంగా ఎరువులు అందుతున్నాయని పేర్కొన్నారు. రైతులు కూడా ప్రస్తుత విధానంపై సంతృప్తి వ్యక్తం చేస్తున్నారని చెప్పారు. యూరియా కొరత, బ్లాక్ మార్కెటింగ్, అధిక ధరలకు విక్రయాలు లేదా లింకేజ్ విక్రయాలకు సంబంధించిన ఆరోపణలు పూర్తిగా నిరాధారమని వ్యవసాయ శాఖ స్పష్టం చేసింది. రైతులకు యూరియా పంపిణీ, ధరలు లేదా ఇతర ఎరువుల విక్రయాలకు సంబంధించి ఏవైనా సమస్యలు ఎదురైతే వెంటనే వ్యవసాయ అధికారులను సంప్రదించాలని సూచించింది. ఫిర్యాదులు అందిన వెంటనే క్షేత్రస్థాయిలో విచారణ నిర్వహించి, ఆరోపణలు నిజమైతే సంబంధిత డీలర్లపై ఎరువుల నియంత్రణ ఉత్తర్వుల ప్రకారం తక్షణ చర్యలు తీసుకుంటామని మండల వ్యవసాయ అధికారి తెలిపారు.

## యూరియా బుకింగ్ యాప్ వినియోగించాలి



**జనసైన్యం సిటి**

సిద్దిపేట జిల్లా అక్కన్నపేట మండలం రామవరం గ్రామంలో వ్యవసాయ విస్తరణ అధికారి (ఏఈఓ) శ్రీలత ఆధ్వర్యంలో రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎల్‌నినో ప్రభావం వల్ల పంటలపై ఏర్పడే ప్రతికూల పరిస్థితులు, కరువు పరిస్థితులను ఎదుర్కొనే యాజమాన్య పద్ధతులపై రైతులకు వివరించారు. 50 నుంచి 75 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదై, భూమిలో తగినంత తేమ ఏర్పడిన తర్వాతే వర్షాధార పంటల విత్తనాలు వేయాలని సూచించారు. ఎల్‌నినో ప్రభావం కారణంగా వర్షపాతం తగ్గే అవకాశం ఉండటంతో పాటు వేడి తరంగాలు పెరిగి భూగర్భ జలాల లభ్యత తగ్గవచ్చని, దీని ప్రభావం పంటల దిగుబడులపై పడే అవకాశం ఉందన్నారు. నేల పరీక్షల ఆధారంగా ఎరువులను వినియోగించాలని, అధికంగా యూరియా వాడటం వల్ల నేల ఆరోగ్యం దెబ్బతింటుందని రైతులకు వివరించారు. పంట అవశేషాలను కాల్చడం వల్ల పర్యావరణంతో పాటు నేలలోని సూక్ష్మజీవులు నష్టపోతాయని, వాటిని నేలలో కలియదున్నడం ద్వారా భూసారం పెరుగుతుందని తెలిపారు. అలాగే యూరియా బుకింగ్ యాప్ వినియోగంపై రైతులకు అవగాహన కల్పించారు. రైతులు యాప్ ద్వారా ముందస్తుగా బుకింగ్ చేసుకుని మాత్రమే యూరియా తీసుకోవాలని సూచించారు. మొబైల్ నంబర్ లింక్ కానివారు లేదా యాప్‌కు సంబంధించిన సందేహాలు ఉన్నవారు రైతు వేదికను సంప్రదించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ శ్రీశైలం, ఉపసర్పంచ్ లింగాల కనుకయ్య, వనపర్తి నరేష్, లింగాల రాజయ్య, లింగాల శ్రీనివాస్, సంతోష్, సురేష్, యాదయ్య, యాదగిరి, వంగపల్లి రమేష్, సత్తయ్య, గట్టయ్య, సురేందర్, కరెంగారి మల్లారెడ్డి, రవితేజ తదితర రైతులు పాల్గొన్నారు.

## రైతులకు సరిపడా నాణ్యమైన విత్తనాలు



**జనసైన్యం సిటి**

రైతులకు సరిపడా ఎరువులు, నాణ్యమైన విత్తనాలు అందించి వ్యవసాయ పనులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ పార్టీ హుస్నాబాద్ నియోజకవర్గ నాయకులు అయిలేని మల్లికార్జున రెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం హుస్నాబాద్ వ్యవసాయ శాఖ ఏడీఏ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్ రాజుకు బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో రైతులు ఎరువుల కోసం రోజులు తరబడి ఫర్టిలైజర్ దుకాణాల చుట్టూ తిరిగిన పరిస్థితులు ఉన్నాయని, ప్రస్తుతం ప్రభుత్వం తీసుకొచ్చిన యాప్ విధానం రైతులను మరింత అయోమయానికి గురిచేస్తోందన్నారు. యాప్ ఎప్పుడు పనిచేస్తుందో తెలియకపోవడంతో పాటు, ప్రతి రైతు వద్ద స్మార్ట్‌ఫోన్ అందుబాటులో లేదని పేర్కొన్నారు. వెంటనే యాప్ విధానాన్ని రద్దు చేసి పాత విధానంలోనే ఎరువుల పంపిణీ చేపట్టాలని కోరారు. ఖరీఫ్ సీజన్‌ను దృష్టిలో ఉంచుకొని రైతులకు సరిపడా నాణ్యమైన విత్తనాలు అందించాలని, నకిలీ విత్తనాలు, నకిలీ రసాయనాలు విక్రయించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే రైతులు వడ్డీ వ్యాపారులను ఆశ్రయించకుండా బ్యాంకుల ద్వారా సకాలంలో పంట రుణాలు అందేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు చిత్తారి శ్రీనివాస్, అయిలేని గాల్ రెడ్డి, భూక్యా రాజు నాయక్, మంద జానకిరాం రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## దేశ సరిహద్దు సైనికుడుకి ఇచ్చిన జీతం, సౌకర్యాలు సాఫయి కార్మికుడుకి ఇవ్వాలి.



**జనసైన్యం సిటి**

సిఐటియు అనుబంధ మునిసిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా ఈరోజు సుమారు 250 మందిమున్సిపల్ కార్మికులు దీక్షలలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా CITU జిల్లా ఉపాధ్యక్షులు ఎడ్ల రమేష్ దీక్షలు ప్రారంభం చేసి మాట్లాడుతూ దేశ సరిహద్దులో పని చేస్తున్న సైనికుడుకి ఇచ్చిన జీతం, ఇతర సౌకర్యాలు సమాజ పరిశుభ్రత కోసం అంతర్గతంగా పని చేస్తున్న సాఫయి కార్మికుడుకి అలాంటి జీతం,సౌకర్యాలు కల్పించాలని, తక్షణమే కాంగ్రెస్ పార్టీ ఎన్నికల వాగ్దానాలని అమలు చేయాలని డిమాండ్ చేశారు.

మున్సిపల్ కార్పోరేషన్లో పని చేసే ఔట్సోర్సింగ్ ఎన్.ఎం.ఆర్ ఫిక్స్డ్ పే కార్మికులను పర్మనెంట్ చేయాలని, రెండో పిఆర్సి ప్రకటించి కనీస వేతనం రూ.26 వేలు నిర్ణయించి, కేటగిరి వేతనాలను అమలు చేయాలని, మున్సిపల్ కార్మికులకు మొదటి ప్రాధాన్యతగా ఇందిరమ్మ ఇల్లు, ఇండ్ల స్థలాలు ఇవ్వాలని, మున్సిపల్ కార్మికులకు ఒక్కపూట 8 గంటల పని విధానం అమలు చేయాలని డిమాండ్ చేశారు. లేనట్లయితే రేవంత్ రెడ్డి ప్రతిపక్షంలో ఉన్నడుపు సూచించిన విధంగా రాష్ట్ర వ్యాప్త నిరవధిక సమ్మె చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు కరీంనగర్ నగర కన్వీనర్ పుల్లెల్ల మల్లయ్య,మున్సిపల్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జనగాం రాజమల్లు, రాష్ట్ర మహిళా కన్వీనర్ ముక్కెర బుజ్జమ్మ, జిల్లా అధ్యక్షులు కవ్వంపల్లి రవి, వర్కింగ్ ప్రెసిడెంట్ కాంపల్లి పోచయ్య, కార్పొరేషన్ అధ్యక్ష, కార్యదర్శులు మానుపాటి మల్లేశం, దేవునూరి శ్యాంసుందర్, నాయకులు దాసరి రాజమల్లయ్య, బందిలి తిరుపతి, బడిగల చంద్రయ్య, బి వెంకటస్వామి, కొంకంటి పద్మ, పురత్తం రాధ మొండయ్య తదితరులు పాల్గొన్నారు.

## కరీంనగర్‌లో ఘనంగా శ్రీ మహాశక్తి దేవాలయ షోడశ (16వ) వార్షికోత్సవం



**జనసైన్యం సిటి**

కరీంనగర్ ప్రజల ఆరాధ్య దైవాలు, మహిమాన్విత శక్తి స్వరూపులైన శ్రీ మహాదుర్గ, శ్రీ మహాలక్ష్మి, శ్రీ మహాసరస్వతి అమ్మవార్లు కొలువుదీరిన దివ్య క్షేత్రం “శ్రీ మహాశక్తి దేవాలయం”. అఖండ భక్తి పారవశ్యంతో, ఆధ్యాత్మిక శోభతో ఈ దేవాలయ షోడశ (16వ) వార్షికోత్సవ వేడుకలు శుక్రవారం అత్యంత వైభవంగా జరిగాయి. జగద్గురు శంకరాచార్య హంపి విరూపాక్ష విద్యారణ్య పీఠాధిపతులు శ్రీశ్రీశ్రీ విద్యారణ్య భారతి స్వామి వారి దివ్య పర్యవేక్షణలో జరిగిన ఈ వేడుకలకు భక్తులు భారీగా తరలివచ్చారు. సర్వాంగ సుందరంగా అలంకరించిన ఆలయంలో తెల్లవారుజాము నుంచే ప్రత్యేక పూజా కార్యక్రమాలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. వైభవంగా పూజా కార్యక్రమాలు, అభిషేకాలు జరిగాయి. ఉదయం 4:30 గంటలకు జగద్గురువుల కరకమలాల ద్వారా శ్రీ లక్ష్మీ గణపతి స్వామి, శ్రీ మహాదుర్గ, శ్రీ మహాలక్ష్మి, శ్రీ మహాసరస్వతి అమ్మవార్లు, అనంతనాగేంద్ర స్వామి వారికి విశేష అభిషేకాలు నిర్వహించారు. ఉదయం 8:00 గంటలకు స్వస్తిపుణ్యాహవాచనం, గణపతి పూజ, అఖండ దీపారాధన, సర్వతోభద్ర మండల పూజలను భక్తిశ్రద్ధలతో జరిపారు. లోక కళ్యాణార్థం లక్ష్మీగణపతి హోమం, రుద్ర సహిత చండీ హోమాలను వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య నిర్వహించి, పూర్ణాహుతితో కార్యక్రమాన్ని సంపన్నం చేశారు. ఈ వార్షికోత్సవ వేడుకల సందర్భంగా భక్తులకు జగద్గురువుల దివ్యోపదేశం చేశారు. శ్రీశ్రీశ్రీ విద్యారణ్య భారతి స్వామి భక్తులను ఉద్దేశించి అనుగ్రహ భాషణం చేశారు. ఆ సందర్భంగా విద్యారణ భారతీయ స్వామి మాట్లాడుతూ “దేవాలయం అంటే కేవలం కోరికలు తీర్చుకునే కేంద్రం కాదు; అది ఒక గొప్ప ఆధ్యాత్మిక స్ఫూర్తి కేంద్రం. ఇక్కడ లభించే ప్రశాంతతను మనం అనుభవంలోకి తెచ్చుకోవాలన్నారు. దైనందిన అలవాట్లులో మార్పు చేసుకోవాలన్నారు. “మనుషులు ఆరోగ్యంగా, ఉత్సాహంగా ఉండటానికి ప్రతిరోజూ సూర్య నమస్కారాలు ఆచరించాలని, దీనివల్ల మనకు అపారమైన శక్తి లభించడమే కాకుండా, అంతా శుభం జరుగుతుందన్నారు. “సమాజంలో మనం విడిపోతే పడిపోతాం.. అదే కలిసి ఉంటే బలంగా ఉంటాం. ఐక్యమత్యమే మహా బలం, ఇదే ధర్మ మార్గం” అన్నారు. మహిళలకు కూడా పై నినాదం వర్తిస్తుందన్నారు. ఎందుకంటే మహిళలు తమ వెంట్రుకలను గట్టిగా అల్లుకొని ముడి వేసుకుంటే వెంట్రుకలు బలంగా ఉంటాయని, లేదు ఫ్యాషన్ కోసం విరబోసుకునే విధంగా చేస్తే జుట్టు రాలిపోయి బలహీన పడతారని స్వామీజీ సందర్భంగా అన్నారు. తలకు నూనెకి పెట్టుకోవడం ఎంతో ముఖ్యమన్నారు. విద్యుత్ ట్రాన్స్ఫార్మర్ నడవాలన్నా, వాహనాలు నడవాలన్నా ఆయిల్ ప్రాముఖ్యత ఎంత ఉందో, మనిషికి తలపై ఆయిల్ పెట్టుకోవడం కూడా అంతే ముఖ్యమైందన్నారు. తలలో ఉండే మెదడు సరిగా పనిచేయాలన్న నూనె రాయడం తప్పనిసరి అన్నారు. ఈ వార్షికోత్సవ కార్యక్రమంలో అశేష సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.



## ఘనంగా డెక్కన్ క్రానికల్ జనరల్ బాడీ సమావేశం




**జనసైన్యం సిటి**

డెక్కన్ క్రానికల్ కరీంనగర్ బ్రాంచ్ ఎంప్లాయీస్ యూనియన్ జనరల్ బాడీ సమావేశం శుక్రవారం ఘనంగా నిర్వహించారు.. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా డెక్కన్ క్రానికల్ ఎంప్లాయీస్ యూనియన్ సెంట్రల్ యూనియన్ జనరల్ సెక్రటరీ, తెలంగాణ రాష్ట్ర INTUC కోశాధికారి కసిరెడ్డి జగన్మోహన్ రెడ్డి హాజరయ్యారు.ఈ సమావేశంలో హైదరాబాద్ యూనియన్ నాయకులు జి. సురేందర్, కె. శ్రీనివాస్, కె. సాగర్, వైజాగ్ బ్రాంచ్ యూనియన్ నాయకులు ఎన్.వి. అప్పారావు, విజయవాడ బ్రాంచ్ యూనియన్ జనరల్ సెక్రటరీ సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.కసిరెడ్డి జగన్మోహన్ రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో కరీంనగర్ బ్రాంచ్ ఉద్యోగులు, కార్మికులు తమ సమస్యలు, విన్నపాలు మరియు అభిప్రాయాలను యూనియన్ నాయకత్వం దృష్టికి తీసుకువచ్చారు. ఉద్యోగుల హక్కుల పరిరక్షణ, సంక్షేమం సంస్థలో వివిధ సమస్యల పరిష్కారానికి జగన్మోహన్ రెడ్డి అందిస్తున్న సేవలను ఉద్యోగులు కొనియాడారు.ఈ సందర్భంగా జగన్మోహన్ రెడ్డి మాట్లాడుతూ, ఉద్యోగుల సంక్షేమం హక్కుల పరిరక్షణ కోసం తన పోరాటం నిరంతరం కొనసాగుతుందని, ప్రస్తుతం ఉన్న సమస్యలకు త్వరలోనే సానుకూల పరిష్కారాలు లభిస్తాయని విశ్వాసం వ్యక్తం చేశారు. ఉద్యోగులు ధైర్యంగా ఉండాలని, యూనియన్ ఎల్లప్పుడూ వారికి అండగా ఉంటుందని తెలిపారు.యూనియన్‌ను మరింత బలోపేతం చేయడంలో భాగంగా నిర్వహించిన ఈ సమావేశంలో కరీంనగర్ బ్రాంచ్ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన కార్యవర్గంలో కరీంనగర్ బ్రాంచ్ జనరల్ సెక్రటరీగా కొండల్ రెడ్డిని, జాయింట్ సెక్రెటరీగా పింగిలి నరేందర్ రెడ్డిని, ఆర్గనైజింగ్ సెక్రటరీగా బిల్లా కృష్ణారెడ్డి, కనపర్తి మురళి, ఉపాధ్యక్షుడిగా శ్రీనివాస్. కోశాధికారిగా ఎన్నం రాజిరెడ్డి, కార్యవర్గ సభ్యులుగా మాదాసు వెంకటేశ్వర్లు నీ నియమించినట్లు జగన్మోహన్ రెడ్డి ప్రకటించారు. అలాగే ఇతర కార్యవర్గ సభ్యుల పేర్లను కూడా వెల్లడించారు.నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులు సంస్థ అభివృద్ధి, ఉద్యోగుల సంక్షేమం యూనియన్ బలోపేతానికి చిత్తశుద్ధితో పనిచేస్తామని, కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు.ఈ సమావేశం ఉద్యోగుల్లో ఐక్యత, సంఘటిత శక్తి యూనియన్ పట్ల విశ్వాసాన్ని మరింత పెంపొందించిందని పాల్గొన్న నాయకులు అభిప్రాయపడ్డారు.

## ఘనంగా రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు



**జనసైన్యం సిటి**

సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ అంబేద్కర్ చౌరస్తాలో కాంగ్రెస్ పార్టీ అగ్ర నాయకుడు, లోక్ సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలను పార్టీ శ్రేణులు ఘనంగా జరుపుకున్నారు. ప్రత్యేకంగా తయారు చేయించిన కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. టపాసులు కాల్చి సంబరాలు జరిపారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధిక స్థానాలు సాధించి రాహుల్ గాంధీ ప్రధానమంత్రి అవుతారని పార్టీ నాయకులు ధీమా వ్యక్తం చేశారు. రాహుల్ గాంధీ సమర్థతను దెబ్బతీసేలా బిజెపి నాయకులు ఎన్ని కుట్రలు పన్నిన వాటిని ఎదుర్కొని రాహుల్ గాంధీ ధైర్యంగా నిలబడ్డారని గుర్తు చేశారు. రాష్ట్రంలో రాహుల్ గాంధీ ఆశయాలకు అనుగుణంగా ప్రజా పాలన ప్రభుత్వం ముందుకు వెళ్తుందన్నారు.

## బీసీ కార్పొరేషన్ రుణాలు ఎప్పుడు ఇస్తారు



**జనసైన్యం సిటి**

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండున్నర సంవత్సరాలు గడుస్తున్నప్పటికీ బీసీ వర్గాల అభ్యున్నతి, నిరుద్యోగ యువత ఆర్థిక స్వావలంబన కోసం చేపట్టాల్సిన చర్యల్లో పూర్తిగా విఫలమైందని బీఎస్పీ హుస్నాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి పచ్చిమట్ల రవీందర్ గౌడ్ తీవ్రంగా విమర్శించారు. గత ఏడాది ప్రభుత్వం "రాజీవ్ యువ వికాసం" పేరుతో రూ.50 వేల నుంచి రూ.10 లక్షల వరకు సబ్సిడీ రుణాలు అందజేస్తామని ప్రకటించి రాష్ట్రవ్యాప్తంగా వేలాది మంది యువత నుంచి దరఖాస్తులు స్వీకరించిందని, అయితే ఇప్పటివరకు ఒక్క లబ్ధిదారుడికైనా రుణం మంజూరు చేసిన దాఖలాలు కనిపించడం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా వ్యాప్తంగా లక్షలాది మంది బీసీ నిరుద్యోగ యువత స్వయం ఉపాధి కోసం ఆశతో దరఖాస్తులు చేసుకున్నారని, ప్రభుత్వ ఉద్యోగాలు రాకపోయినా సబ్సిడీ రుణాల ద్వారా ఉపాధి పొందాలని భావించిన యువతకు కాంగ్రెస్ ప్రభుత్వం తీవ్ర నిరాశ మిగిల్చిందని పేర్కొన్నారు. ప్రభుత్వం స్వీకరించిన దరఖాస్తుల పరిస్థితి ఏమిటో ప్రజలకు స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. దరఖాస్తులను పరిశీలిస్తున్నారా..? అర్హుల ఎంపిక ప్రక్రియ ఏ దశలో ఉంది..? రుణాల మంజూరు ఎప్పుడు ప్రారంభమవుతుంది..? అనే విషయాలపై ప్రభుత్వం వెంటనే సమాధానం చెప్పాలని కోరారు. అలాగే రాష్ట్రంలో వివిధ కులాల అభివృద్ధి కోసం ఏర్పాటు చేసిన కార్పొరేషన్లకు తగిన నిధులు కేటాయించకపోవడం విచారకరమన్నారు. కార్పొరేషన్లు ఏర్పాటు చేయడం మాత్రమే కాకుండా వాటి ద్వారా సంబంధిత వృత్తులు, ఆర్థిక కార్యకలాపాలు అభివృద్ధి చెందేలా నిధులు అందించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు.రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన 33 కార్పొరేషన్లకు కనీసం రూ.1000 కోట్ల చొప్పున ప్రత్యేక నిధులు కేటాయించి, బీసీలు, వెనుకబడిన వర్గాల ఆర్థికాభివృద్ధికి కట్టుబడి ఉందని నిరూపించాలని డిమాండ్ చేశారు. బీసీల సమస్యలను నిర్లక్ష్యం చేస్తూ, ఎన్నికల హామీలను అమలు చేయడంలో ప్రభుత్వం వ్యవహరిస్తే రానున్న ఎన్నికల్లో ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీఎస్పీ నాయకులు దేగల వెంకటేష్, దుంద్ర రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

## ఫిరాయింపుల సంస్కృతి -ప్రమాదంలో ప్రజాస్వామ్యం



డాక్టర్.కోలాహలం రామ్ కిశోర్.

పార్టీ ఫిరాయింపులు భారత రాజకీయాల్లో కొత్త విషయాలు కావు. కానీ గత దశాబ్ద కాలంలో అవి ఒక రాజకీయ వ్యూహం ప్రకారంగా, అధికారాన్ని కేంద్రీకరించే సాధనంగా, ఎన్నికల తీర్పులను తలకిందులు చేసే ఆయుధంగా బీజేపీ పాల్పడటం ప్రజాస్వామ్యానికి తీవ్రమైన హెచ్చరిక ను పంపుతుంది.

తాజాగా పశ్చిమ బెంగాల్‌కు చెందిన కొంతమంది తృణమూల్ కాంగ్రెస్ ఎంపీలు పెద్దగా ఎవరికీ తెలియని ఒక చిన్న రాజకీయ పార్టీ ద్వారా కొత్త రాజకీయ సమీకరణాలకు తెరతీయడం, భారత రాజకీయాల్లో జరుగుతున్న మార్పుల స్వరూపాన్ని మరింత స్పష్టంగా చూపించింది. ఈ పరిణామం కేవలం ఒక పార్టీ అంతర్గత సంక్షోభం కాదు. ఎన్నికల ద్వారా ప్రజలు ఇచ్చిన తీర్పును రాజకీయ చాతుర్యంతో ఎలా వక్రీకరించవచ్చో తెలిపే నీచ రాజకీయాలకు ఒక ఉదాహరణగా నిలిచింది.

ప్రజాస్వామ్యంలో ఓటరు ఒక వ్యక్తికి మాత్రమే ఓటు వేయడు. అతడు ఒక పార్టీ సిద్ధాంతానికి, విధానానికి, నాయకత్వానికి, ఎన్నికల హామీలకు కూడా ఓటు వేస్తాడు. ఎన్నికల సమయంలో బీజేపీని తీవ్రంగా విమర్శించి, కేంద్ర ప్రభుత్వ విధానాలను ఖండించి గెలిచిన నాయకులు, ఎన్నికలు ముగిసిన తర్వాత అదే బీజేపీ రాజకీయ శక్తికి దగ్గరవడం ప్రజల విశ్వాసాన్ని దెబ్బతీస్తుంది. ఇది వ్యక్తిగత రాజకీయ భవిష్యత్తు కోసం ప్రజా తీర్పును పక్కన పెట్టడమే అవుతుంది. అందుకే ఫిరాయింపులను చాలామంది రాజకీయ అవినీతికి మరో రూపంగా అభివర్ణిస్తారు.

భారత రాజ్యాంగంలో 1985లో తీసుకువచ్చిన పదో షెడ్యూల్, అంటే వ్యతిరేక ఫిరాయింపుల చట్టం, ఇలాంటి రాజకీయ వ్యాపారాన్ని అరికట్టడానికే రూపొందించబడింది. అయినప్పటికీ, చట్టంలోని లోపాలను ఉపయోగించుకొని పెద్ద ఎత్తున విలీనాలు, సమూహ ఫిరాయింపులు, రాజీనామాలు, తిరిగి ఎన్నికలు వంటి మార్గాల ద్వారా రాజకీయ నాయకులు చట్ట స్ఫూర్తినే బలహీనపరుస్తున్నారు. కర్ణాటక, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, గోవా, అరుణాచల్ ప్రదేశ్, మణిపూర్ వంటి రాష్ట్రాల్లో గత కొన్నేళ్లలో జరిగిన రాజకీయ పరిణామాలు దీనికి ఉదాహరణలు. ఎన్నికల్లో ఓడిపోయిన చోట ప్రత్యర్థి పార్టీల ప్రజాప్రతినిధులను ఆకర్షించడం ద్వారా అధికార సమీకరణాలను మార్చడం ఒక సాధారణ రాజకీయ పద్ధతిగా బీజేపీ మార్చివేసింది. ఈ చర్యలు రాజ్యాంగ విలువల స్ఫూర్తికి విరుద్ధంగా నిలిచింది.

ఈ నేపథ్యంలో బీజేపీపై దేశవ్యాప్తంగా వచ్చిన ప్రధాన విమర్శ ఏమిటంటే, ఎన్నికల ద్వారా సాధించలేని రాజకీయ ఆధిపత్యాన్ని ఫిరాయింపుల ద్వారా సాధించాలనే ప్రయత్నం చేస్తోందన్నది. అధికారంలో ఉన్న పార్టీగా దాని వద్ద ఉన్న రాజకీయ, పరిపాలనా, ఆర్థిక ప్రభావం ఇతర పార్టీల నేతలను ఆకర్షించడానికి లేదా ఒత్తిడి చేయడానికి ఉపయోగపడుతోందని ప్రతిపక్షాలు చాలా కాలంగా ఆరోపిస్తున్నాయి. కేంద్ర దర్యాప్తు సంస్థల కేసులు ఎదుర్కొంటున్న పలువురు నాయకులు బీజేపీలో చేరిన తర్వాత విచారణల వేగం తగ్గిందన్న విమర్శలు కూడా తరచుగా వినిపిస్తున్నాయి. ఈ ఆరోపణలన్నీ నిరూపితమైనవి కాకపోయినా, ప్రజలలో అనుమానాలు పెరగడానికి మాత్రం కారణమవుతున్నాయి.

ఇక్కడ మరింత ఆందోళన కలిగించే అంశం ఏమిటంటే, ఫిరాయింపులను వ్యతిరేకించిన రాజకీయ శక్తులే కొన్నిసార్లు వాటికి వేదికలుగా మారడం. ఎన్నికల సమయంలో "ఫిరాయింపుదారులను తిరస్కరించండి" అని పిలుపునిచ్చిన సంస్థలు లేదా నాయకులు, తరువాత అదే ఫిరాయింపుల ద్వారా రాజకీయ బలం సంపాదించడానికి ప్రయత్నిస్తే అది సిద్ధాంతపరంగా దివాళా తీసినట్లే. ప్రజలకు చెప్పేది ఒకటి, ఆచరించేది మరొకటి అనే భావన బలపడుతుంది.

ఫలితంగా రాజకీయాలపై ప్రజల విశ్వాసం మరింత క్షీణిస్తుంది.భారతదేశంలో ఎన్నికలు నిర్వహించడానికి వేల కోట్ల రూపాయలు ఖర్చవుతున్నాయి. కోట్లాది మంది ఓటర్లు గంటల తరబడి క్యూలలో నిలబడి తమ ఓటు హక్కును వినియోగిస్తున్నారు. కానీ ఎన్నికల తర్వాత కొందరు నాయకులు పార్టీలు మార్చి రాజకీయ సమీకరణాలను మార్చివేస్తే, ఓటర్ల అభిప్రాయాలకు విలువ ఏమిటి ? అనే ప్రశ్న తలెత్తుతుంది. ఓటరు తిరస్కరించిన రాజకీయ శక్తి... వెనుక ద్వారం ద్వారా అధికారాన్ని లేదా సంఖ్యాబలాన్ని పెంచుకోవడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధం.

అయినా బీజేపీ తన విధానాలను మార్చుకోదు. ఏమైనా, ఎలాగైనా విపక్షాలు నేతలను తమ పార్టీలో కలుపుకోవడమే దాని లక్ష్యం, నైతిక విలువలతో దానికి పనిలేదు.

ఈ పరిస్థితి ఇలాగే కొనసాగితే ఎన్నికలు



కేవలం ఒక ప్రారంభ కార్యక్రమంగా మాత్రమే మిగిలిపోతాయి. అసలు రాజకీయ పోరాటం ఎన్నికల తర్వాత ప్రజాప్రతినిధులను ఎవరు తమవైపు తిప్పుకుంటారనే అంశంపై ఆధారపడే ప్రమాదం ఉంది. ఇది ప్రజాస్వామ్యాన్ని క్రమంగా ప్రతినిధుల మార్కెట్‌గా మార్చే ప్రమాదకర ధోరణి. రాజకీయ పార్టీలు సిద్ధాంతాలు, విధానాలు, ప్రజా ఉద్యమాల ఆధారంగా కాకుండా అధికారానికి దగ్గరగా ఉండే లెక్కలపై నడిచే పరిస్థితి ఏర్పడుతుంది.

ఈ నేపథ్యంలో ఫిరాయింపుల చట్టాన్ని మరింత కఠినతరం చేయాల్సిన అవసరం ఉంది. ఒక పార్టీ గుర్తుపై గెలిచిన ప్రజాప్రతినిధి పార్టీ మారితే వెంటనే సభ్యత్వం రద్దు కావాలి. తిరిగి ప్రజల వద్దకు వెళ్లి కొత్త పార్టీ తరఫున ఎన్నికల్లో గెలిస్తేనే ఆ మార్పుకు ప్రజాస్వామ్య చట్టబద్ధత లభించాలి. లేకపోతే ఎన్నికల తీర్పులు కేవలం గణాంకాలుగా మిగిలిపోతాయి.ప్రజాస్వామ్యానికి అతిపెద్ద శత్రువు ప్రత్యక్ష నియంతృత్వం మాత్రమే కాదు; ప్రజల ఓటుతో ఏర్పడిన రాజకీయ సంకల్పాన్ని నెమ్మదిగా నిర్వీర్యం చేసే అవకాశవాద రాజకీయాలు కూడా. పార్టీ ఫిరాయింపులు అదే ప్రమాదానికి ప్రతీక.

ఎన్నికలలో ఓటర్ల నిర్ణయాన్ని గౌరవించడం ప్రజాస్వామ్యానికి కనీస నిబంధన. ఆ తీర్పును రాజకీయ వ్యూహాలతో వక్రీకరించడం ఎంత చట్టబద్ధంగా కనిపించినా, ప్రజాస్వామ్య నైతికత దృష్ట్యా అది ప్రజా విశ్వాసంపై జరిగిన దాడిగానే చరిత్ర గుర్తుంచుకుంటుంది. మోదీ హయాంలో బీజేపీ, ఆరెస్సెస్ ఉన్నత ఆశయాలకు, సిద్ధాంతాలకు అతీతంగా పరిణామం చెందటం చరిత్రలో మాయని మచ్చగా మిగిలిపోతుంది.